## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనలు మరియు వారి ప్రత్యేక రక్షణకై దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰهُمَّ اَيِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ
وَبَارِكْ لَنَا فِيْ عُمْرِهٖ وَاَمْرِهٖ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰهُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّةٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

తెలుగు వార పత్రిక

The Weekly BADAR Qadian Telugu

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి 3

సంచిక 36

వార్షిక చందా 500/-రూ॥

www.akhbarbadrqadian.in

06 సెప్టెంబర్ 2018, 25 జుల్ హజ్ 1439 హి.ఖ, 06 తబూఖ్ 1397, హి.శ,


## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تُبْطِلُوْا صَدَقٰتِكُمْ بِالْمَنِّ وَالْاَذٰى

“ ఓవిశ్వాసులారా! దాంభికముతో, ఇతరులకు బాధను కలుగునట్లు నడుచుకొని మీ దానములను వ్యర్థము చేసుకొనకుడు. ”

**(బఖ్రహ్ : 265)**

సయ్యదినా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా ఇలా సూచించిరి: కిస్తియే నూహ్‌లో పేర్కొనబడిన మా ఉపదేశములను అహ్మదీయులందరు పఠించవలెను. ఒక విధముగా పూర్తి కిస్తియే నూహ్ రచననే పఠించుటకు ప్రయత్నించినచో ఉత్తమం.

**అల్లాహ్, అతని దాసుల హక్కులను గురించి ఒక ధనికుడిని అడిగినట్లే ఒక భిక్షకునిని అడుగబడును. అతని కంటే అధికముగానే. తాత్కాలిక జీవితమును నమ్మి అల్లాహ్‌కు పూర్తిగా దూరమైనవాడెంత దురదృష్టవంతుడో?.**

**ఉపదేశము: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం**

అల్లాహ్ పూర్వమున్నట్లు ఇప్పుడు కూడ ఉన్నాడు. పూర్వమున్న శక్తులే ఇప్పుడు గలవు. సంకేతములు అధికారము పూర్వమున్నట్లు ఇప్పుడు కూడ అతనికి గలవు. మరి మీరు కేవలం గాథలకు రాజీ పడుదురా? మహిమలు, భవిష్యవాణులు కేవలం గాథలుగా కలిగి వున్న ధర్మము నాశనమైన ధర్మము. అల్లాహ్ అవతరించని వర్గము, నమ్మకము ద్వారా అల్లాహ్ చేతులతో శుభ్రము కాని వర్గము చచ్చిన వర్గము. మానవుడు ఐహికయ అభిరుచులకు ఆకర్షింపబడునట్లు నమ్మకము ద్వారా ఆధ్యాత్మిక అభిరుచులు పొందినప్పుడు అల్లాహ్ వైపు ఆకర్షింపబడును. అతని అందము ముగ్ధునిగా చేసి ఇతర వస్తువులను విస్మరింపజేయును. శిక్షించుటలో అల్లాహ్ ఎంత కఠినుడో ఫలమొసంగుటలో అంతే దయామయుడని ఎరిగిన నాడే పాపము నుండి మానవుడు ముక్తి పొందును. అజ్ఞానము ఎదురుదాడికి పునాది. అల్లాహ్ నమ్మకము ద్వార భాగము పంచుకొనిన వాడు ఎదురు తిరుగడు. తన ఇంటి వైపు అతి వేగముగా నీటి వరుద వస్తుందని తెలిసినవాడు గాని, ఇంటి చుట్టు నిప్పంటుకొన్నదని తెలిసినవాడు గాని ఆ ఇంటిలో ఉండలేడు. మరి మీరు అల్లాహ్ శిక్షించునని నమ్మకము కలిగి కూడ తమను అపాయకర స్థితుల నుండి ఆపరా?. ప్రపంచమంతా వ్యాపించివున్న అల్లాహ్ శాసనమును కనులు విప్పి చూడుము. క్రింది వైపున పోవు ఎలుకలుగా మారక, గగనమునకెగురు పావురములుగా మారుము. పశ్చాతప్తులై పాపము దరిచేరకుము. కుబుసము వీడిన సర్పమువలే మారకుము. సమీపమున చేరు మృత్యువును విస్మరించకుము. అది ఎప్పుడొచ్చునో మీకు తెలియదు . నిరంజకుడే పరిశుభ్రతను ఇష్టపడును. కనుక నిరంజకులగుటకు ప్రయత్నించుము.

కాని ఈ వరమును మీరెట్లు పొందగలరు?. పవిత్ర ఖుర్ఆన్ యందు అల్లాహ్ తఅలా స్వయముగా ఈ విధముగా నుడివెను. “ వస్తయీనూ బిస్సబ్రి వస్సలాత్ ” అనగా ప్రార్థనా, సహనముతో అల్లాహ్ సహాయమును ఆర్జించుము. ప్రార్థన అననేమి?. ప్రశంస, సంకీర్తన, పవిత్రత, పశ్చాత్తాపము, వినయవిధేయతలతో అర్జించు అభ్యర్థన. కనుక మీరు ప్రార్థన సలుపు చున్నప్పుడు తెలియని వారివలే కేవలం అరబి పదాలలోనే అభ్యర్థించకుము. అట్లు చేయు వారి ప్రార్థన, పశ్చత్తాపము లన్నియు నిజముకావు. అది కేవలం ప్రదర్శన మాత్రమే. మీరు ప్రార్థన సలుపునప్పుడు అల్లాహ్ వచనములైన ఖుర్ఆన్‌ను, ప్రవక్త మాటలనే గాక తమ భాషలో యాచించుము. దీని వలన మీ హృదయములందు వినయవిధేయతల భావము జన్మించుము. ప్రార్థన రాబోవు ఆపదలకు చికిత్సా. రాబోవు రోజులు ఎలా ఉండునో మీరేరుగరు. కనుక మీ కొరకు శుభములు గల సూర్యోదయమగుటకు తమ ప్రభువు ముందు వినయవిధేయతతో మోకరిల్లుము.

ఓ అధికారులారా! ఓ అధినేతలారా! ఓ ధనికులారా! అల్లాహ్‌కు భయపడువారు, అతని సర్వ మార్గముల యందు నిజాయితి గలవారు. మీలో కొందరే గలరు. ప్రపంచ ఆస్తిపాస్తులు కోరుచు వయస్సు గడుపుచు మృత్యువును విస్మరించు వారనేకులు గలరు. ప్రార్థన సలుపని, అల్లాహ్‌ను విస్మరించిన ప్రతి ధనికునిపై అతని సర్వ సేవకుల, పరిచారకుల పాపభారముండును. మద్యపానము సేవించు ప్రతి అధికారికి అతని వెంటనున్న వారి పాపము కూడ తగులును. ఓ బుద్ధిమంతులారా! జాగ్రత్తా! ఈ ప్రపంచము శాశ్వత స్థానము కాదు. మీరు నిలకడగా ఉండి ప్రతి మత్తు పదార్థమును విడిచి పెట్టుము. మానవున్ని సర్వ నాశనము చేయునది కేవలం మద్యపానమే కాదు నల్లమందు, చరస్, కల్లు మొదలుగున్నవి మెదడును చెరపి అంత మొందించునవి. కనుక వీటి నుండి దూరముండుము. ప్రతి సంవత్సరము మత్తుకు బానిసలైన మీ బోటి వారిని మీరు నాశనమగుట చూసి గూడా మీరు ఉపయోగించుట అంంతు పట్టక అర్థము గాని విషయము. పరలోక శిక్ష వేరే. మీ వయస్సు పెరుగుటకు, అల్లాహ్ శుభములు పొందుటకు నిష్ఠా పరులుగా మారుము. హద్దులు దాటి భోగభాగ్యాలకు అలవడుట శాపగ్రస్థ జీవితము. విచ్చల విడిగా వ్యవహరించుట, అల్లాహ్, అతని దాసులను విస్మరించుట శాపగ్రస్థ జీవితము.

అల్లాహ్, అతని దాసుల హక్కులను గురించి ఒక ధనికుడిని అడిగినట్లే ఒక భిక్షకునిని అడుగబడును. అతని కంటే అధికముగానే. తాత్కాలిక జీవితమును నమ్మి అల్లాహ్‌కు పూర్తిగా దూరమైనవాడెంత దురదృష్టవంతుడో?. అల్లాహ్ నిషేదించిన వాటిని అతని కొరకు ధర్మ యుద్ధము చేసినట్లు బాహాటముగా నుపయోగించును. కోపస్థితియందు ఒకనిని దూషించును, మరొకరిని గాయపర్చును. ఒకనిని హతమార్చుటకు సిద్ధమగును. కామోద్రేకముతో సిగ్గు విడిచి హద్దులు మీరును. మరణించు వరకు అతడు మంచి స్థితిని పొందడు. ఓ సోదరులారా! మీరు కొద్దిరోజుల కొరకు ప్రపంచమునకు వచ్చిన వారు. ఎక్కువ భాగము గడిచిపోయినది. కనుక తమ ప్రభువుకు కోపము కలిగించకుము. ఒక మానవ ప్రభుత్వము మీపై కోపగించినప్పుడు మిమ్ము నాశనము చేయవచ్చును. అల్లాహ్ కోపముతో మీరేల రక్షింపబడుదురో ఆలోచించరా?. అల్లాహ్ దృష్టిలో మీరు నిష్టాపరులైనచో ఎవ్వడు మిమ్ము నాశనమొనర్చలేడు. అతడు స్వయముగా మిమ్ము కాపాడును. మీ ప్రాణములు తీయగోరు శత్రువు మిమ్ము లోబర్చుకోలేడు. లేనిచో మిమ్ము కాపాడువాడు మరొకడు లేడు. మీరు శత్రువులకు భయపడుచు, కష్టనష్టాలలో చిక్కుకొని చింతాక్రాంతులై జీవితము గడుపుదురు. అంతిమ రోజులు చీకాకు పర్చునవిగా ఉండును. అతనిని అనుసరించిన వారికి అల్లాహ్ శరణమిచ్చును. కనుక అల్లాహ్ వైపు పరుగెత్తుము. అతనితో వైరుద్యధోరణిని వీడుము. అతని కార్యముల యందు అశ్రద్ధ పనికి రాదు. అతని దాసులకు నోటితో గాని, చేతులతో గాని అన్యాయము చేయకుము. ఆకాశపు బాధకరమైన శిక్షతో భయపడుచుండుము. ఇదే ముక్తి మార్గము.

**(కిస్తియే నూహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 37-39)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం:-** (ఉపన్యాసం జల్సా సాలాన ఖాదియాన్ 2015)

## జీవితాంకిత ప్రాముఖ్యత, జామిఅ అహ్మదియ్యలో విద్యాభ్యాస శుభములు

✦ ✦ ✦

وَلْتَكُن مِّنكُمْ أُمَّةٌ يَدْعُونَ إِلَى الْخَيْرِ وَيَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنكَرِ وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ

(ఆలె ఇమ్రాన్: 105) అనగా మీలో కొందరు ఒక సంఘముగా ఏర్పడి ప్రజలను ఉత్తమత్వము వైపు ఆకర్షించి ఉత్తమత్వమును నేర్పి దౌష్ట్యము నుండి దూరముగా నుండు నట్లు చేయవలెను. ఇట్టి వారికే విజయము చేకూరును

اسلام چیز کیا ہے خدا کے لئے فنا — ترکِ رضائے خویش پئے مرضئ خدا
خدا سے وہی لوگ کرتے ہیں پیار — جو سب کچھ ہی کرتے ہیں اُس پر نثار

అనగా దేవుని కొరకు అంకితమగుట, దేవుని ఇష్టముకై తన ఇష్టమును వీడుటయే ఇస్లాం.

దేవుని కొరకు సర్వమును అంకితము చేసినవారే అతన్ని ప్రేమింతురు.

అల్లాహ్‌ను ఆరాధించుట, సర్వము అతనికే అంకితము చేయుట మానవ జీవిత జన్మ ఉద్దేశము. మరో రకంగా దేవుని కొరకు జీవితమును అంకితము చేయుట అని అనవచ్చును. ప్రతి యుగములో ఈ దైవ అంకిత ప్రాముఖ్యత, అవసరము యుండెను. అవతరించిన సందేశహరులందరు జీవితము అంకితము చేసిన వారే. వారు దైవాంకిత సజీవ రూపములను నెలకొల్పి బలిదానము, త్యాగ ఉత్తేజమును మానవుల హృదయములలో గట్టిగా నెలకొల్పిరి. తద్వారా మానవుడు తన ప్రియమైన ప్రాణమును త్యాగము చేయుటకు కూడ వెనుకాడలేదు.

శ్రోతలారా! జీవితము అంకితము చేయు ఆరంభము దేవుని ఈ ఆజ్ఞ أَلَسْتُ بِرَبِّكُمْ తో అయ్యెనని పవిత్ర ఖుర్ఆన్ ద్వారా తెలియును. ఇటుల తన ప్రేమపూర్వక భావమును మానవుని హృదయములో ఏర్పరచి ఆ భావమును పెంపొందించుటకు తన ప్రతినిధి హ॥జ్రత్ ఆదమ్‌ను భూమికి పంపెను. వారు దేవుని పిలుపును స్వీకరించిరి. అల్లాహ్ ప్రేమలో నిమగ్నమై తన పూర్తి జీవితమును అంకితము చేసిరి. ఇటులనే అబుల్ అన్బియా హ॥జ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం ఈ మార్గములో ఎంతటి గొప్ప త్యాగములు సమర్పించిరనగా ప్రపంచము మనుగడ సాగించునంత వరకు వారి కొరకు దయానుగ్రహ ప్రార్థనలు చేయుట విశ్వాసుల సమూహముపై విధించబడెను. అల్లాహ్ ఆదేశము మేరకు తమ ప్రియమైన సతీమణి, గారాల కుమారుని జీవితము, మరణమును లెక్క చేయకుండా నీరు, నీడ లేని ఎడారి ప్రాంతములో వదులుటయే కాక సంపూర్ణ విశాల హృదయముతో وَجَّهْتُ وَجْهِيَ لِلَّذِي فَطَرَ السَّمَاوَاتِ وَالْأَرْضَ حَنِيفًا అనగా నేను భూమ్యాకాశములను పుట్టించిన వాని వైపు ఆకర్షింపబడుచు, నా శ్రద్ధను మళ్లించితినని తెలిపి أَسْلَمْتُ لِرَبِّ الْعَالَمِينَ అనగా నేను సర్వలోక నాథునికి విధేయుడనని ప్రకటించిరి. జీవితాంకిత మైదానములో ఇబ్రాహీమ్ కుమారుడు హ॥జ్రత్ ఇస్మాయీల్ త్యాగము కూడ సాటిలేని త్యాగము. హ॥జ్రత్ ఇబ్రాహీమ్ ఈ దృఢసంకల్ప కుమారుడు ఎగిరి దునికే వయస్సునకు చేరినప్పుడు తన వృద్ధ తండ్రి దైవస్వప్నమును బాహ్య రూపంలో పూర్తి చేయుటకు తన ప్రియమైన ప్రాణ త్యాగమును ఈ పదములలో నమర్పించిరి. يَا أَبَتِ افْعَلْ مَا تُؤْمَرُ سَتَجِدُنِي إِن شَاءَ اللَّهُ مِنَ الصَّابِرِينَ (అస్సాఫ్ఫాత్:103) అనగా ఓ నా తండ్రి! నీకు ఆదేశించునట్లు చేయుము. అల్లాహ్ కోరినచో నీవు నన్ను నిశ్చయముగా సహనము వహించు వారిలో పొందెదవు.

ఈ ప్రత్యేక సందేశహరులలో ప్రథమ స్థానము మన ప్రియతమ నాయకులు విధేయతార్హులు ఖాతమున్నబియ్యీన్ హ॥జ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం కలిగియుండిరి. వారు దైవ మార్గములో జీవితాంకిత భావమును అత్యున్నత స్థాయికి చేర్చిరి. పవిత్ర ఖుర్ఆన్ వారి హృదయ భావాలను, ఆత్మ పిలుపును శాశ్వతముగా ఈ అక్షరములలో భద్రపరచెను. قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ (అల్ అన్ఆమ్:163) అనగా నీవు ఇట్లనుము. నా ఆరాధన, నా బలిదానములు, నా జీవితము, నా మరణము సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే.

ఈ కాలములో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆధ్యాత్మిక సుపుత్రుడు, సంపూర్ణ దాసుడు, నిజమైన ప్రేమికుడు హ॥జ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం మరల జీవింపజేసి చూపిరి. తమ ప్రియమైన యజమాని అడుగుజాడలో నడుచుచు ఇస్లాం జీవితము కొరకు తమ ప్రాణము, ధనము, గౌరవము, తమ సర్వ శక్తులు, సామర్థ్యములు ఇట్లనుచు అంకితము చేసిరి. وقف راہ تو کنم گر جاں دہندم صد ہزار అనగా ఒక లక్ష సార్లు నాకీ ప్రాణమివ్వబడినా ఈ మార్గములోనే అంకితము చేయుదును.

అంకితములో అనన్య శుభములు, అనంత లాభములు గలవు. అందుకే సందేశహరులు తమ దైవ కార్య పరిపూర్ణత పరంపరలో అంకితపు లాభములు, శుభములను తమ ఉనికి వరకే పరిమితము చేయక ప్రతి కాలములో 'అల్లాహ్ కొరకు నా సహాయకులెవరు' అని ప్రకటించి, విశ్వాసుల సమూహము దైవ ధర్మము కొరకు తమ జీవితములను అంకితము చేయవలెనని పిలుపునిచ్చిరి. విశ్వాసులలోని ఒక వర్గము సదా సందేశహరుని పిలుపును స్వీకరించి తమ జీవితములను సమర్పించిరి.

జీవితాంకిత ప్రేమికులలో సదుద్దేశముతో సమర్పించిన హ॥జ్రత్ ఆదమ్ అలైహిస్సలాం కుమారుడి జీవితాంకిత మనోహర అంగీకారమును فَتُقُبِّلَ مِنْ أَحَدِهِمَا (అల్ మాయిదహ్:28) అనగా ఒకని బలి స్వీకరించబడెను అను ప్రేమ పూర్వక పదములలో పవిత్ర ఖుర్ఆన్ ప్రస్తావించెను. అనంతరం పవిత్ర తల్లి హ॥జ్రత్ మర్యమ్ అలైహస్సలాం సంతానమును అంకితము చేయు ఉత్తేజమును పవిత్ర ఖుర్ఆన్ فَتَقَبَّلَهَا رَبُّهَا بِقَبُولٍ حَسَنٍ **(ఆలె ఇమ్రాన్:38)** అనగా ఆమె ప్రభువు ఆమెను ఉత్తమముగా స్వీకరించెను. అను పదములలో కొనియాడెను. ఇటువంటి అసాధారణ త్యాగ ఉదాహరణలున్నను మనము రసూలె అక్రమ్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర కాలమును చూసినప్పుడు ప్రవక్త అనుచరులు ఈ విశ్వాసపు హక్కును ఎంత గొప్పగా నిర్వర్తించిరనగా సింహాసనాధీషుడైన అల్లాహ్ వారి గురించి رَّضِيَ اللَّهُ عَنْهُمْ وَرَضُوا عَنْهُ (అల్‌బయ్యినహ్:9) అనగా అల్లాహ్ వారితో రాజీ పడెను. వారు అతనితో రాజీ పడిరని సాక్ష్యమిచ్చినట్లు తెలియును.

అంకితపు కథ ఇక్కడితోనే ముగియదు. وَآخَرِينَ مِنْهُمْ భవిష్యవాణి ప్రకారము తన ప్రత్యేక దయానుగ్రహముతో అల్లాహ్ అహ్మదియ్య సంస్థ రూపంలో విశ్వాసుల ఒక సమూహమును సిద్ధము చేసెను. ప్రవక్త (సల్లం) అనుచరుల వలె మహా గొప్ప ఉదాహరణలను మరల నెలకొల్పుటయే

**(8 వ పేజిలో చదువుము. )**

# జుమా ప్రసంగము

అల్లాహ్ తఆలా కృపానుసారము నేడు మనము మరొక వార్షిక సభలో పాల్గొను అనుగ్రహము పొందుచున్నాము. కొందరు మొదటి సారిగా సభలో పాల్గొంటున్నారు. అనేకులకు ప్రయాణం సౌకర్యాలు మరియు ఈ దేశ రాయబార కార్యలయము నుండి అనుమతి లభిస్తుంటాయి. ఫలితముగా వారు పదే పదే ఇక్కడి జల్సాలలో పాల్గొంటు ఉంటారు. యు.కే లో నివాసం ఉంటున్నవారిలో కూడ కొందరు మొదటిసారిగా ఈ జల్సాలలో పాల్గొనుటకు వస్తున్నారు. అలాంటి వారు ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకొన్ని కొంత కాలమే అవుతుంది. ఇక్కడే స్థిరపడిపోయారు. లేదా కొందరు పిల్లలు పూర్తి వివేకంతో, తెలివితో ఈ జల్సాల నుండి ప్రయోజనం పొందుటకు ప్రయత్నిస్తున్నారు.

అందరికి తెలిసిన విషయమేమనగా, జల్సాలో అన్ని రకాల ఏర్పాట్లకు, లేదా సుమారుగా 90% వరకు ప్రత్యేకించి ఈ జల్సా మూడు రోజుల పాటు జమాఅత్ సభ్యులు స్వచ్ఛంధముగా సేవలు అందిస్తుంటారు. అందువలన కొన్ని శాఖలలో లోపాలు, లోటు పాట్లు కూడ వుంటాయి. కాని ఆ లోపాలను, లోటుపాట్లను జల్సాలో పాల్గొన్న మనమందరము కలసి దూరం చేయుటకు ప్రయత్నించాలి. వాటిని దూరం చేయాలి. సేవకులు తమ పనులను పరిశీలించుచు చక్కదిద్దుకొనుటకు ప్రయత్నింతురు. అలాగే అతిథులు, పాల్గొను సభ్యులు కూడ ఆయా లోపాలు, లోటుపాట్లను చూసి, చూడనట్లుగా విస్మరించవలెను.

మన సభలో మనవారితో పాటు ఇతరులు కూడ వస్తారు. వచ్చేవారందరు మంచి ప్రవర్తనలు కలిగి వుందురు లేదా ధర్మము నేర్చుకొనుటకు వస్తారు లేదా ఇస్లాం అహ్మదియ్యత్ గురించి తెలుసుకొనుటకు వస్తారు. మానవ లోపాలు అందరిలో వుంటాయి. ఏదైనా హెచ్చుతగ్గులు ఏర్పడినచో లేదా ఎవరైనా నియమములను అతిక్రమించినచో వారు దుష్టులని లేదా వారికి సదుద్దేశములు లేవని మనము అనలేము. ఇవి మానవ లోపాలు. వీటి వలన ఒక్కోసారి హెచ్చుతగ్గులు ఏర్పడవచ్చును. ఇటులైనచో భరించవలెను. అహ్మదీ అతిథి అయినా ఆతిథ్యమిచ్చువాడైనా సత్ప్రవర్తనలు ప్రదర్శించవలెను.

సభతో అధికాధికముగా ప్రయోజనము పొందుటకు అల్లాహ్ తఆలా అందరిని అనుగ్రహించుగాక! నేను ఇప్పుడు చూసించిన సూచనలను, మార్గదర్శకాలను లేదా మీ కార్యక్రమాల పుస్తకములో సూచించిన వాటిని పాటించు భాగ్యమును కూడ అల్లాహ్ తాలా మనకు కల్పించుగాకా! కాని అన్నింటికన్న ముఖ్యమైనది, ఈ సూచనలు, మార్గదర్శకాలపై ఆధిక్యత గలదు మరొకటి గలదు అది దుఆ. జల్సా విజయవంతమగుటకు ప్రత్యేకముగా అందరు దుఆ చేయగలరు. అల్లాహ్ తఆలా తన శుభముతో మాత్రమే సభను అన్ని విధాలా విజయవంతము చేయుగాక! ప్రతి ఇబ్బంది నుండి రక్షించుగాక! మనమిక్కడ ఏ ప్రయోజనము కొరకు సమావేశమైనామో దానిని పొందువారమగుదము గాక! (ఆమీన్)

ప్రచార శాఖ వారు ఆన్‌లైన్ ద్వారా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రపై ఉపన్యాసాల పోటిని నిర్వహిస్తున్నది. అందులో కూడ ప్రజలు పాల్గొంటున్నారు. మొత్తానికి చాలా కార్యక్రమాలు, విషయాలు గలవు. వీటన్నింటి నుండి ప్రజలు ప్రయోజనం పొందగలరు. అల్లాహ్ తాలా పాల్గొన్న వారందరికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆలకు అర్హులను చేయుగాకా! (ఆమీన్)

**సయ్యిద్నా అమీరుల్ మొమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 03 ఆగష్టు 2018 ( 03 జహూర్ 1397 హి.ష) తేదీన బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِينَ - اَلرَّحْمٰنِ الرَّحِيمِ - مٰلِكِ يَوْمِ الدِّينِ

إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ - اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ

అల్లాహ్ తఆలా కృపానుసారము నేడు మనము మరొక వార్షిక సభలో పాల్గొను అనుగ్రహము పొందుచున్నాము. కొందరు మొదటి సారిగా సభలో పాల్గొంటున్నారు. అనేకులకు ప్రయాణం సౌకర్యాలు మరియు ఈ దేశ రాయబార కార్యలయము నుండి అనుమతి లభిస్తుంటాయి. ఫలితముగా వారు పదే పదే ఇక్కడి జల్సాలలో పాల్గొంటు ఉంటారు. యు.కే లో నివాసం ఉంటున్నవారిలో కూడ కొందరు మొదటిసారిగా ఈ జల్సాలలో పాల్గొనుటకు వస్తున్నారు. అలాంటి వారు ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకొన్ని కొంత కాలమే అవుతుంది. ఇక్కడే స్థిరపడిపోయారు. లేదా కొందరు పిల్లలు పూర్తి వివేకంతో, తెలివితో ఈ జల్సాల నుండి ప్రయోజనం పొందుటకు ప్రయత్నిస్తున్నారు. సభలో పాల్గొనువారందరు ఈ మూడు రోజులు సభ ఆధ్యాత్మిక వాతావరణముతో లబ్ది పొందుటకు ప్రయత్నించవలెను. సభ కార్యక్రమాలను మౌనము, శ్రద్ధతో విన్నప్పుడే సభలో పాల్గొను లాభము కలుగును. అప్పుడే మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ జల్సాను నిర్వహించవలసిన లక్ష్యమును మనము పూర్తి చేసిన వారమవుదుము.

అందరికి తెలిసిన విషయమేమనగా, జల్సాలో అన్ని రకాల ఏర్పాట్లకు, లేదా సుమారుగా 90% వరకు ప్రత్యేకించి ఈ జల్సా మూడు రోజుల పాటు జమాఅత్ సభ్యులు స్వచ్ఛంధముగా సేవలు అందిస్తుంటారు. అందువలన కొన్ని శాఖలలో లోపాలు, లోటు పాట్లు కూడ వుంటాయి. కాని ఆ లోపాలను, లోటుపాట్లను జల్సాలో పాల్గొన్న మనమందరము కలసి దూరం చేయుటకు ప్రయత్నించాలి. వాటిని దూరం చేయాలి. సేవకులు తమ పనులను పరిశీలించుచు చక్కదిద్దుకొనుటకు ప్రయత్నింతురు. అలాగే అతిథులు, పాల్గొను సభ్యులు కూడ ఆయా లోపాలు, లోటుపాట్లను చూసి, చూడనట్లుగా విస్మరించవలెను. సేవకులకు సహాయము అవసరమున్న చోట అతిథులు స్వయముగా ముందుకు వచ్చి వారికి సహకరించవలెను. మనము పరస్పరం సహకరించుకొన్నప్పుడే మనలో ఐక్యత ఏర్పడవచ్చును. ఒకవేళ సహాయము అవసరమున్నప్పుడు తప్పకుండా సహకారమును అందించగలరు. ఈ ప్రాథమిక విషయమును అతిథులు, ఆతిథ్యమిచ్చు వారిరువురు గుర్తుంచుకోవలెను.

సాధారణముగా సేవకులకు, నిర్వాహకులకు వారి వారి బాధ్యతలను, కర్తవ్యములను గూర్చి జల్సాకు ఒక వారం రోజుల ముందునాటి జుమా ప్రసంగంలో నేను వివరిస్తుంటాను. అతిథులకు ప్రత్యేకించి జల్సా రోజు నాటి జుమా ప్రసంగంలో వారి బాధ్యతల వైపు వారికి శ్రద్ధను కల్పిస్తాను. మన జల్సాలు మరియు మన నిర్వాహణ వ్యవస్థ

యొక్క విశిష్టత ఏమనగా, మనలో ప్రతి ఒక్కరు తమ తమ హక్కులను, బాధ్యతలను సక్రమముగా నిర్వహించుటకు, వాటిని అర్థం చేసుకొనుటకు ప్రయత్నిస్తుంటాము. ఫలితముగానే పరస్పరం ప్రేమానురాగాలు ఏర్పడుతాయి. మొత్తానికి నేను నేడు ఇరువురికి కొన్ని సూచనలు ఇచ్చెదను. వాటివైపు శ్రద్ధను కల్పించెదను.

సేవకులను ఉద్దేశించి నేను గత జుమా ప్రసంగంలో ఏమి ప్రస్తావించలేదు. కాని గత ఆదివారం జల్సా నిర్వాహణ పనులను పర్యవేక్షించ వలసి ఉండెను. వారి నడవడిక ఎలా ఉండాలి. వారు ఏ విధముగా సేవలు అందించాలని అనే విషయాన్ని ఆ సమయంలో నేను వారికి వివరించి చెప్పినాను. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన చాలా కాలం నుండి ఈ సేవకులు లేదా వీరిలో అనేకులు డ్యూటీలు ఇస్తూనే వస్తున్నారు. అందువలన పనిని అర్థం చేసుకోవడంలో, వాటిని బాధ్యత పూర్వముగా నెరవేర్చడంలో ఇక్కడి సేవకులు చాలా అనుభవంను కల్గి ఉన్నారు. అదే విధముగా ప్రతి సంవత్సరం క్రొత్తగా ఈ సేవలలో చేరు సేవకులకు, బాలలకు, యువతకు గత కొన్ని సంవత్సరాలుగా సేవలందిస్తున్న సేవకులు, అధికారులు తమ అనుభవంను పాఠాలుగా వారికి చెప్పుతుంటారు. కాని కొన్ని ప్రత్యేక విషయాలను గూర్చి ప్రత్యేక శ్రద్ధ కల్పిస్తూ వాటిని గుర్తుకు చేయడం కూడ చాలా తప్పని సరియే. కావున నేను తెల్పినట్లుగా కొన్ని విషయాలను గూర్చి ఇప్పుడు నేను అతిథులకు, ఆతిథ్యమిచ్చు వారికిరువురికి సూచనలు చేయుదును.

సేవకులకు చెప్పదలచిన మొట్ట మొదటి విషయమేమనగా అల్లాహ్ తాలా అదేశాను సారం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రారంభించిన జల్సాలో పాల్గొనుటకు వచ్చిన అతిథులకు సేవలు చేయుటకు సేవకులు తమకు తాము స్వయముగా అర్పించుకొనిరి. అంతేగాని వారు ఏదో ప్రాపంచిక జాతరలో పాల్గొనడానికి రాలేదు. పైగా వీరు తమ ఆధ్యాత్మిక జ్ఞానము, ప్రవర్తనల ప్రామాణికములను మెరుగు పరచుకొనుటకు వచ్చారు. సభలో పాల్గొను ప్రతి వ్యక్తి ఆలోచన ఇలాగే గలదని, ఇలాగే వుండవలెనని నేను ఆశించుచున్నాను. లేనిచో వారు సభలో పాల్గొనుట వృథా అగును. అతిథుల ప్రవర్తన ఎలా వున్నను సేవకులు తమ గొప్ప ప్రవర్తనలను ప్రదర్శించుచు అతిథుల మనోభావాలు, మర్యాదలను దృష్టియందుంచుకోవలెను. ఒకవేళ ఎప్పుడైనా అతిథులు గాని, సభలో పాల్గొనుటకు వచ్చినవారు కాని ఏదేని పొరపాటు చేసినను సేవకులు సమయస్ఫూర్తితో వ్యవహరించవలెను. తమ ఉద్వేగములను అదుపులో పెట్టుకోవలెను. వారికి కోపముతో సమాధానం ఇవ్వకూడదు. ప్రతి సేవకుడు అల్లాహ్ తఅలా ప్రీతి కొరకు అతిథులకు సేవచేయుటకు తమను తాము అంకితం చేసుకున్నప్పుడు అల్లాహ్ తఅలా ప్రీతి కొరకు ఏవేని పొరపాట్లు దొర్లినను వాటిని భరించవలసి ఉంటుంది. అప్పుడే అల్లాహ్ తఆలా ప్రీతి, ప్రసన్నతను పొందువారగుదురు. మనము నమ్ముచున్న ప్రవక్త ప్రవర్తన అతిథుల పట్ల ఎట్లుండెను? వారు ఎప్పుడో ఒకసారి వచ్చే అతిథులు కాదు. సంవత్సరానికి ఒక సారి జల్సా కోసం వచ్చేవారు కాదు. వారు నగరవాసులు. ప్రతి రోజు వారితో భేటి అగుటకు వచ్చేవారు. వారిని వారి బీదత్వము వలన లేదా మరో కారణముచే విందుకు ఆహ్వానించినచో వారు వచ్చి సుదీర్ఘ సమయము కూర్చొని మాట్లాడుకుంటున్నచో, వారి సల్లం విశ్రాంతి లేదా వారి పనులలో ఆటంకము ఏర్పరచినచో సమయము కంటే ముందే రాకూడదు, నేను పనులలో నిమగ్నమైవున్నాను లేదా భుజించిన తరువాత త్వరగా వెళ్లిపోగలరు, మీరు కూర్చున్నందున నేను నా పనులు చేసుకోలేక పోతున్నానని వారెన్నడు అనలేదు. ప్రజల ఈ పరిస్థితి చూసి అతిథుల పట్ల వారి సహనము, ఓర్పును గమనించి అల్లాహ్ తఆలా విశ్వాసులకు ఇట్లు సూచించెను. فَیَسۡتَحۡیٖ مِنۡکُمۡ (అల్ అహజాబ్: 54) అతడు మీ మనోభావాలను గుర్తించి మిమ్ములను వెళ్ళిపొమ్మని చెప్పుటకు సిగ్గుపడును. కాని ఈ మాట చెప్పుటకు అల్లాహ్ తఆలా వెనుకాడడు. కనుక ప్రవక్త ఇంట్లో సుదీర్ఘ కాలము కూర్చొని అతనికి ఇబ్బంది కలిగించకుము. ఒక వైపు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆతిథ్య గొప్ప ఉదాహరణను అల్లాహ్ తఆలా ప్రస్తావించెను. గొప్ప ప్రవర్తనలు కలిగివుండిరని తెలిపెను. మరో వైపు అతిథులుగా వచ్చి తమ పరిధి దాటకూడదని అతిథులకు కూడ సూచించెను. అతిథులు తాము అతిథులమని హద్దులు దాటి లబ్ది పొందకూడదు.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముస్లిమేతరులకు ఎలా అతిథ్య సేవదలందించారో, ఎంతగా సహనము పాటించారో, ఎంత ప్రామాణికము కలిగివుండిరో చూచి మానవుడు ఆశ్చర్యపోవును, వింతకు గురగును. ఇందుకు ఒక ఉదాహరణ మనము చూడగలము. ఒక ముస్లిమేతరుడు అతిథిగా వచ్చినప్పుడు వారు సల్లం అతనికి సకల మర్యాదలు చేసిరి. ఉదయం తిరిగి వెళ్ళేటప్పుడు అతడు పరుపును మలినము చేసి వెళ్లిపోయెను. వారు స్వయముగా దానిని శుభ్రము చేసిరి. హుజూర్ ఎందుకు ఇబ్బంది పడుచున్నారు, సేవ చేయు అవకాశము మాకివ్వండి, మేమున్నామని అనుచరులు వేడుకొనిరి. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అతడు నా అతిథిగా యుండెను. నేనే అతని మలినమును శుభ్రము చేస్తాను. ఇదెంత గొప్ప ఆదర్శమనగా దీనికి పోటీగా మరెవరు నిలువలేరు.

(మసన్వీ మౌల్వీ మఅన్వీ దఫ్తర్ 5, పుట 20-24, అనువాదం, ఖాజి సజ్జాద్ హుస్సైన్ అల్ ఫసీల్ లాహోర్ 2006)

మన సభలో మనవారితో పాటు ఇతరులు కూడ వస్తారు. వచ్చేవారందరు మంచి ప్రవర్తనలు కలిగి వుందురు లేదా ధర్మము నేర్చుకొనుటకు వస్తారు లేదా ఇస్లాం అహ్మదియ్యత్ గురించి తెలుసుకొనుటకు వస్తారు. మానవ లోపాలు అందరిలో వుంటాయి. ఏదైనా హెచ్చుతగ్గులు ఏర్పడినచో లేదా ఎవరైనా నియమములను అతిక్రమించినచో వారు దుష్టులని లేదా వారికి సదుద్దేశములు లేవని మనము అనలేము. ఇవి మానవ లోపాలు. వీటి వలన ఒక్కోసారి హెచ్చుతగ్గులు ఏర్పడవచ్చును. ఇటులైనచో భరించవలెను. అహ్మది అతిథి అయినా ఆతిథ్యమిచ్చువాడైనా సత్ప్రవర్తనలు ప్రదర్శించవలెను. కాని వార్షిక సభ అతిథుల సేవకు తమను తాము సమర్పించుకున్న వారు ఎక్కువ మంచి ప్రవర్తనలు ప్రదర్శించవలెను. సేవకులచే సత్ప్రవర్తనలు ప్రదర్శించబడినచో ఎదుటి వ్యక్తి స్వయముగా పశ్చాత్తాపపడును. ప్రతి సేవకుడు ప్రతి విభాగములో తన విధులలో గొప్ప ప్రవర్తనలు ప్రదర్శించవలెను. ఈ రోజులను ఒక గొప్ప సవాలుగా స్వీకరించి గొప్ప ప్రవర్తనలు ప్రదర్శించవలెను.

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇటు వైపు సూచించుచు ఇట్లు నుడివెను. قُوۡلُوۡا لِلنَّاسِ حُسۡنًا (బఖ్రాహ్: 84) అనగా మానవులతో దయతో మాట్లాడుము. మంచిగా సంభాషించుము. వివాదములను అంతము చేయుటకు, గొప్ప ప్రవర్తనలు ప్రదర్శించుటకు ఇది ప్రాథమిక విషయము. ఈ నిబంధన ప్రత్యేక సందర్భముల కొరకు కాదు, ఎల్లప్పటికి ఉపయోగపడును. మానవునికి ఇది అలవాటైనచో కలహాలు, దౌర్జన్యములు సంభవించనే సంభవించవు. కనుక అతిథ్యమిచ్చువారు అతిథులు ఇక్కడ మాత్రమే కాక ఎల్లప్పుడు ఈ ఆదేశమును గుర్తుంచుకోవలెను. ప్రత్యేకంగా ఈ రోజులలో తప్పక దీనిని పాటించగలరు. మనము తమ తమ ప్రవర్తన, ఆధ్యాత్మిక స్థితిని మెరుగు పరచుకొను ఏ ఉద్దేశముతో ఇక్కడ ప్రోగైనామో ఆ ఉద్దేశము పూర్తి అగుటకు మనమందరము కలిసి ఈ పరిసరాలను

ఆనందదాయకముగా చేయవలెను. అది మన ప్రవర్తనలు మరియు ఆధ్యాత్మిక స్థితి గతులను మెరుగు పర్చుకోవడం. ఈ ప్రవర్తనలే ఇక్కడికి వచ్చే ముస్లిమేతరులకు కూడ ఇస్లాం యొక్క ఔనత్యాన్ని తెలియజేయుటకు కారణముగా నిలుచును. ఇదొక నిశబ్ద ప్రచారం. అతిథులు మరియు ఆతిథ్యమిచ్చువారు ఇరువురు నిశబ్ద ప్రచారం చేయుచున్న వారగుదురు.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. త్రాసులో ఉత్తమ ప్రవర్తనను మించినది మరొకటి లేదు. మంచి ప్రవర్తనలు కలిగిన వ్యక్తి నమాజ్, ఉపవాసాలకు కూడ అలవాటు పడిపోవును. (సునన్ అబూ దావూద్, కితాబ్ అదబ్, బాబ్ ఫి హుస్నుల్ ఖుల్క్. హదీస్ 4798-4799) అనగా అతనికి పుణ్యముల అనుగ్రహము లభించును. ప్రత్యేకించి అల్లాహ్ తఆలా ప్రీతి కొరకు పుణ్యము చేయు భాగ్యము లభించును. అప్పుడు ఒక పుణ్యము అనేక పుణ్యములకు జన్మనిచ్చుచు పోవును. ఫలితముగా అల్లాహ్ తఆలా ఆదేశానుసారం సత్ప్రవర్తనతో మెలుగు అవకాశం లభిస్తుందని అల్లాహ్ తఆలాకు కృతజ్ఞులుగా నడుచుకొనుందురు. ఈ కృతజ్ఞత భావమే ప్రార్థన వైపు శ్రద్ధ కల్పించును. మొత్తానికి ఒక పుణ్యకార్యము ఉన్నతమైన పుణ్యకార్యములను చక్క బెట్టుటకు అవకాశంను కల్పిస్తుంది. ఒక పుణ్యము అనేక పుణ్యకార్యములను జన్మనిచ్చును.

కనుక సేవకులు తప్పక ఈ విషయమును పాటించవలెను. అనగా ఇతరులు ఎలా ప్రవర్తించినా వారి ముఖములో చిరునవ్వు కనిపించవలెను. ఈ బాహ్య స్థితి వారి హృదయాలను కూడ ప్రభావితం చేయును. హృదయములో కూడ ఎలాంటి కఠినత్వము ఏర్పడదు. హృదయములో అనవసర కఠినత్వము ఏర్పడనప్పుడు కోపము, హృదయములో కఠినత్వం లేనిచో ఆగ్రహములో కొన్ని సార్లు సంభవించే తప్పుడు నిర్ణయాలు కూడ జరగవు.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ప్రవర్తనల ప్రామాణికమును తెలుపుచు ఒక అనుచరుడు ఇట్లు ఉల్లేఖించిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే ఎక్కువ నవ్వుచు కనిపించే ముఖము మరొకరిది చూడలేదు. (సునన్ తిర్మిజి, అబువాబుల్ మనాఖిబ్, బాబ్ ఖౌల్ ఇబ్నే జజఅ మా రఅయిత అహద్ .. హదీస్ 3641)

వారు సల్లల్లాహు అలైహి వసల్లం తమ విశ్వాసులను ఇట్లు ఉపదేశించిరి. కరుణించుము. ఎందుకనగా కరుణతో దూరము చేయబడిన వ్యక్తి మేలును కోల్పోవును. (సహి ముస్లిం, కితాబుల్ బిర్ర్ వ స్వలాత్ బాబ్ ఫజల్ రిఖాబ్ హదీస్ 6598)

ఈ విషయమును సేవకులు, పాల్గొనువారందరు అర్థము చేసుకున్నచో ఈ పరిసరాల శుభము వలన మేలు, అనుగ్రహముతో అందరి సంచులు నిండిపోవును. సేవకులు అల్లాహ్ తఆలా అనుగ్రహము వలన మనస్ఫూర్తిగా అతిథులకు మర్యాదలు చేయుదురు. అయినా కూడ ఒకవేళ ఎవరి హృదయములోనైన ఫలాన వ్యక్తికి చాలా మర్యాదలు చేయుచున్నారు. నాకు మాత్రం నామమాత్రముగానే మర్యాదలు చేస్తున్నారనే భావనే కల్గినచో దానిని దూరం చేసుకోవడం మంచిది. అనగా ఎవరిలోనైన ఇలాంటి ఆలోచనలు వచ్చినట్లు తెలిసినచో సేవకులు వాటిని దూరం చేయుటకు ప్రయత్నించవలెను. మరల నేను సభలో పాల్గొనువారికి కూడ చెప్ప దలచినదేమనగా అల్లాహ్ తఆలా కృపానుసారము సభ కొరకు ఇంత విశాలమైన ఏర్పాట్లు సేవకులతో చేయబడుచున్నవి. వీరు మన ఉద్యోగులు కారు. కొందరు గొప్ప పదవులపై వున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథుల సేవ కొరకు ఒక స్ఫూర్తితో ప్రభావితమై సేవలందించుచున్నారు. ఇంకా సెకండరీ పాఠశాలలు, విశ్వవిద్యాలయములలో చదువుకుంటున్న నవయువకులున్నారు. బాల బాలికలతో పాటు పిల్లలున్నారు. వీరందరు ఒక స్ఫూర్తితో సేవలందించుచున్నారు. కనుక ఎక్కడైనా చిన్న చిన్న పొరపాటు కనిపించినా విస్మరించగలరు. అంతేగాకా కేవలం అల్లాహ్ తఆలా మరియు అతని ప్రవక్త మరియు అతని ధార్మిక విషయాలు ఆలకించుటకు ఇక్కడ ప్రోగైనామనే విషయమును గుర్తుంచుకోవలెను. ఒకవేళ ఈ ఆలోచన మనలో ఉన్నట్లైతే ఎలాంటి ఫిర్యాదులు ఉండవు. జల్సా నిర్వాహణ పనులను చక్క బెట్టుటకు ఒక వ్యవస్థ గలదు. వివిధ ఖాలు గలవు. వాటన్నింటిని ఈ కార్యక్రమమును నిర్వహించుటకు సౌకర్యార్థము ఏర్పాటు చేయడమైనది. ఒకవేళ ఎవరైనా ఒక అతిథికి ఏదేని విభాగములో లోపము కనిపించినచో అనగా అతనికి సరిగా మర్యాధలు చేయలేదని అనిపించినచో సేవకులతో జగడమాడే బదులు ఆ విభాగ బాధ్యునికి వ్రాసి తెలుపవలెను. ఈ సంవత్సరం ఆ లోపమును దూరము చేయలేక పోయినను రాబోవు సంవత్సరం దృష్టియందుంచుకోవచ్చును. మన జమాఅత్ వ్యవస్థ ప్రత్యేకత ఇదే. ఏ ఏ లోపాలు దృష్టికి వచ్చినవో వాటిని దూరము చేయుటకు ప్రయత్నించవలెను.

అతిథ్యములో ఒక ముఖ్యమైన విభాగము ఆహారము వండుట. జల్సా రోజులలో ఒక ప్రణాళిక బద్ధముగా వంటలు వండడం జరుగుతుంది. ప్రపంచములో నిర్వహించే ప్రతి జల్సాలో వండే వంటకాలనే ఇక్కడ కూడ వండడం జరుగుతుంది. పాకిస్తాన్ మరియు భారతదేశంలో వండే వంటకాలను ఇక్కడ వండడం జరుగుతుంది. ఈ శాఖలో పనులు చేయువారు అధికముగా భారతదేశము మరియు పాకిస్తాన్‌లకు చెందినవారై ఉంటారు. వీరు పప్పు, బంగాళదుంపలతో కలపి మాంసాన్ని వండుతారు, అన్నంతో పాటు రొట్టెలు చేస్తారు. అయినా కూడ వంటలు వండువారు వంటలను రుచికరముగా వండుటకు ప్రత్యేక శ్రద్ధ చూపవలెను. ప్రత్యేకించి మాంసంను మొత్తగా ఉడికించాలి. నిన్న మాంసము సరిగా ఉడకలేదనే విషయం నాకు తెలిసింది. నిన్న అతిథులు తక్కువ సంఖ్యలో ఉన్నారు కావున ఎలాంటి ఫిర్యాదు రాలేదు. ఒకవేళ ఈ రోజు కూడ అలాగే వండినచో ఆ శాఖ నిర్వాహకుడు ఈ విషయములో తప్పకుండా చర్యలు చేపట్టాలి. ఒకవేళ మాంసం మంచిగా లేనిచో మంచి మాంసం కోసం వెంటనే చర్యలు తీసుకోవాలి. అతిథులు ఈ విషయములో ఎలాంటి ఫిర్యాదు చేయరని నేను ఆశించుచున్నాను. ఫిర్యాదు చేయవలసి వచ్చినను కోపముతో ఊగిపోవుచు చేయక ఈ లోపమున్నదని అప్యాయముతో నిర్వహకులకు సూచించవలెను. అలా అయినచో అహారము వృదా చేయబడదు. అహారమును సమృద్ధి పర్చుకోవాలనే ఆదేశం గలదు.

సభలో పాల్గొనువారు మరొక విషయము వైపు కూడ దృష్టి సారించవలెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఇస్లాంలోని మరొక సత్ప్రవర్తన ఏమనగా విశ్వాసి అనవసర, వృథా విషయములను వీడవలెను. (సునన్ ఇబ్నే మాజ కితాబుల్ ఫితన్, బాబ్ కఫా లిల్ లిసాన్ హదీస్ 3976) ఈ సభను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కేవలం దైవ ప్రీతి కొరక ప్రారంభించిరని తెలిపిరి. కనుక ఇందులో అన్ని రకాల వృథా విషయములను వీడి సమయమును వృథా చేయకుండా యుండవలెను. సభ కార్యకలాపాలను అతి శ్రద్ధగా వినవలెను. ఉపన్యాసకులు మీకు నచ్చినను నచ్చకున్నను వారి ఉపన్యాసములను ఆలకించుటకు తప్పకుండా ప్రయత్నించవలెను. ఎందుకనగా ఉపన్యాసములు అందరికి ప్రయోజనకముగా ఉండుటకు అనుగుణముగా ఎంపిక చేయడమైనది. ప్రతి ఉపన్యాసంలో ఏదో ఒక అంశం తప్పకుండా శ్రోతల హృదయాలను ప్రభావితం చేయునట్లు ఉండును. అందుకోసమే శ్రద్ధగా ఆలకించవలెను. అత్యవసరమైతే తప్ప సభా ప్రాంగణమును వీడి బయటికి పోకూడదు. ఇప్పుడు ఉన్నట్లుగానే ఉత్తీర్ణత సభా సమయాలలో

సభ ప్రాంగణంలో ఉండవలెను. పిల్లలకు, యువకులకు జల్సాల ప్రాముఖ్యత తెలిసి వచ్చెటట్లు ఉత్తీర్ణత ఉండవలెను. వారు కూడ తమను తాము ధర్మంతో అనుసంధానం చేసుకొనువారలు కావలెను. అందుకోసము ప్రయత్నించగలరు. నేటి ప్రాపంచిక వాతావరణములో పిల్లలు, నవయువకులకు ధర్మ ప్రాముఖ్యతను తెలుపుట, దానితో జోడించుట అతి పెద్ద ముఖ్యమైన పని. ఇటు వైపు ప్రత్యేకంగా దృష్టి సారించవలెను. ప్రతి తల్లిదండ్రులు ఇందుకు కృషి చేయవలెను. అల్లాహ్ తఆలా అందరిని ఇందుకు అనుగ్రహించుగాక!

శిక్షణపరంగా, ధర్మముతో జోడించుటకు అన్నిటికంటే ముఖ్యమైన విషయము ప్రార్థన. ఇందుకోసం మనపై ఐదు పర్యాయముల నమాజ్‌ను విధిగావించడం జరిగింది. జల్సా కార్యక్రమాల వలన, ప్రయాణికుల వలన అధిక సంఖ్యలో అతిథులు ఇతర దేశాల నుండి రావడం వలన ఈ రోజులలో మనం నమాజ్‌లను కలిపి చదువుతుంటాము. కావున వీటిని కూడ క్రమం తప్పకుండా సలుపవలెను. దీనిని తాము స్వయముగా పాటించుచు నమాజుల సమయములలో పిల్లలను ఒకవేళ ఇక్కడ హదీఖతుల్ మహ్దిలో ఉన్నచో తమ వెంట తీసుకొని రాగలరు. ఫజర్ మరియు మఘ్రిబ్, ఇషాల సమయంలో ఇక్కడ కాకుండ ఇంటి వద్ద ఉన్నచో సమీపంలో ఉన్న మస్జిద్‌లకు గాని, నమజజూం సెంటర్‌లకు కాని వెళ్ళగలరు. ఒకవేళ మస్జిదులు, నమాజ్ కేంద్రముల నుండి గృహములు దూరమున్నచో గృహములలోనే సామూహిక నమాజుల కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవలెను. ఇదే విధముగా సేవకులు కూడ నమాజుల సమయంలో ఖాళిగా ఉన్నచో వారు కూడ సామూహిక నమాజ్‌లు సల్పుటకు ప్రయత్నించవలెను. డ్యూటిలో ఉన్న వారు డ్యూటి పూర్తి కాగానే ముందుగా నమాజ్ సల్పుటకు ప్రాముఖ్యత నివ్వగలరు. డ్యూటిలు నిర్ణయించు నిర్వహాకులు, అధికారులు నమాజ్ సమయాన్ని దృష్టియందుంచుకొని డ్యూటిలు నిర్ణయించవలెను. అంతేగాని డ్యూటి వలన నమాజ్ సమయం వెళ్ళిపోవునట్లు డ్యూటిలు వేయకూడదు. ఒక సమయంలో డ్యూటి చేయువారు మరో సమయంలో నమాజ్ సల్పుటకు అనుకూలముగా డ్యూటిలను నిర్ణయించాలి. ఒకవేళ మనకు నమాజుల పట్ల శ్రద్ధ లేకున్నచో మన పనులన్ని వృథాయే.

నిర్వహణ కోణములో కూడ కొన్ని విషయములు చెప్పదలచితిని. తమ స్వంత వాహనములలో వచ్చే వారు నిర్వహాకులకు సహకరించవలెను. ఎక్కడ, ఏ విధముగా వాహనాలను నిలుపవలెనని సూచించెదరో అక్కడ, ఆ విధముగానే నిలుపుటకు ప్రయత్నించగలరు. పార్కింగ్ విషయములో కొన్ని సార్లు కొన్ని సమస్యలు ఏర్పడుతాయి. కొంత మంది పట్టు పడుతారు. తమ ఇష్టాను సారముగా పార్కింగ్ చేయుటకు సేవకులతో తగాద పడుతుంటారు. దాని వలన నిర్వాహణ వ్యవస్థ దెబ్బతింటుంది. కొన్ని సందర్భాలలో ఈ విషయాలు పెద్ద సమస్యను తీసుకవస్తాయి. కొన్ని సంక్లిష్ట పరిస్థితులను నెలకొల్పుతాయి. లేదా భయంకర పరిస్థితులకు దారి తీస్తుంది. అదే విధముగా జల్సా ప్రాంగణములో గాకుండా మస్జిద్ ఫజల్‌లో నమాజులు చదువుటకు వచ్చేవారు కూడ ఇరుగుపొరుగు వారికి ఇబ్బంది కలుగకుండా తమ వాహనములను నిలువలెను. ఈ విషయమును గూర్చి నేను ఆదివారమే సేవకులను ఉద్దేశిస్తూ ప్రసంగించాను, అక్కడ డ్యూటి వారిని ఏర్పాటు చేయాలని సూచించాను. కాని జల్సాలో పాల్గొనువారు, అతిథులు అక్కడికి వెళ్లి నమాజ్ సలుపాలని ప్రయత్నించేవారు ఈ విషయాన్ని వారు తప్పకుండా గుర్తుంచుకోవాలి. అనగా మస్జిద్ ఫజల్‌లో నమాజ్ సల్పుటకు వచ్చేవారు కూడ తమ వాహనాలను ప్రక్క వారి గృహముల దారిని మూసి వేయునట్లుగా నిలిపి వారికి ఇబ్బంది కలిగించకూడదు. వారి గృహాలకు వెళ్ళు దారిని అడ్డగించరాదు. వారికి ఎలాంటి ఇబ్బందిని కలిగించరాదు. మా కార్లు బయటకి వెళ్ళకుండా, లోపలికి రాకుండా మీరు మా ఇంటి ముందు కార్లను నిలిపి మా దారులను మూస్తున్నారని పొరుగు వారు ఫిర్యాదు చేస్తున్నారనే విషయాన్ని నేను ఆదివారం రోజునే సేవకులకు తెలిపాను. ప్రతి సంవత్సరం లేదా ప్రతి పండుగ రోజు, లేదా జల్సా కొరకు సంప్రదించుటకు వెళ్ళుచు కానుకలు ఇచ్చేవారిలో కొందరు ఎంత కఠినముగా స్పందించరనగా, ఖిలాఫత్ మాకు మార్గదర్శనం చేస్తుంది, ఖలీఫా సూచనల మేరకు మేము ఆచరిస్తామని ఖిలాఫత్‌ను గూర్చి పెద్ద పెద్ద మాటలు మాట్లాడేమీరు. మీకు మీ ఖలీఫా పొరుగు వారి హక్కులను గూర్చి చెప్పడం లేదు లేదా మీరు వారి ఆదేశాలను పాటించడం లేదని వెల్లడించారు. ఇది ప్రతి ఒక్కరు సిగ్గుపడాల్సిన పరిస్థితి. ఇతరులు మన గూర్చి ఇలాంటి అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. ఈ విషయం నన్ను చాలా సిగ్గుపడునట్లు చేసింది. వారి ఈ అభిప్రాయము కూడ సరైనదే, నిజమైనదే. ఒకవేళ మనము నిలిపినచో ఈ రెండు కారణాలే వెలుగులోకి వచ్చును. కావున ఇటువైపు ప్రత్యేక శ్రద్ధ చూపగలరు. ప్రత్యేకించి ఈ విషయమును గూర్చి ఆలోచించండి. నిర్మోహమాటముగానైన తమను తాము ఇబ్బందులకు గురి చేసుకోండి కాని పొరుగు వారి దారిని అడ్డుకొని వారికి ఇబ్బందులు కల్గించకండి. ఇస్లాం ధర్మము పొరుగు వారి హక్కులను చెల్లించమని ఎంత స్పష్టముగా తెలుపుతుందో అంత స్పష్టముగా మరే ధర్మము కూడ మనకు తెలుపడం లేదు. అయినా కూడ మనలో కొందరు ఈ బోధనలను అనుసరించనిచో ఇది వాస్తవానికి చాలా సిగ్గుచేటు. పైగా వారు పాపాత్ములవుతారు. ప్రత్యేకించి నేను లండన్ కాకుండా ఇతర ప్రాంతాల నుండి, యూరప్ దేశాల నుండి, జర్మని దేశం నుండి తమ తమ కార్లలో వచ్చేవారికి తెలుపుచున్నాను. వారందరు ఈ విషయాన్ని ప్రత్యేకముగా గుర్తుంచుకోగలరు. కొందరు ఈ విషయాల వైపు శ్రద్ధ చూపడం లేదని నాకు ఫిర్యాదు అందినది. డ్యూటిలో ఉన్న కొందరు యువకులు వారికి నచ్చజెప్పుటకు ప్రయత్నించినప్పుడు వారితో దురుసుగా వ్యవహరిస్తారు. తప్పుగా మాట్లాడుతారు. ముందుగా వారు తప్పుడు పార్కింగ్ చేస్తుంటారు. ఆ తరువాత పొరుగు వారి హక్కులను కూడ హరించివేస్తారు. ఈ విధానం వలన యువకులలో, పిల్లలలో పెద్దల పట్ల గౌరవ మర్యాదలు కనుమరుగవుతుంటాయి. ఆ తరువాత పిల్లలు కూడ వారి వలే మాట్లాడుతుంటారు. ఆ తరువాత వ్యవహారం హద్దు మీరిపోతుంది. ఈ విధముగా నవయువకులను, బాలలను ఎందుకు త్రప్పు త్రోవ పట్టిస్తున్నారు. ఇలా ప్రవర్తించేవారు పెద్ద మొత్తంలో ఖర్చు చేసుకొని, చాలా దూరముగా ప్రయాణం చేసి జల్సాలో పాల్గొనడం ఎలాంటి ప్రయోజనంను చేకూర్చదు. అంతకంటే ఉత్తమము వారు రాకుండ ఉండటమే. నేను ముందుగా తెల్పినట్లుగా వారు దైవాదేశమునకు వ్యతిరేకముగా నడుచుకోవడమే గాకా బాలబాలికలను, యువతను పెడ దారి పట్టిస్తున్న వారవుచున్నారు. కావున ఇకపై ఈ విషయంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపవలెను.

నిర్వహణపరంగా పరిశుభ్రత విభాగము కూడ గలదు. ఇటువైపు కూడ ప్రత్యేక శ్రద్ధ చూపవలెను. ప్రతి సారి గుర్తు చేయిస్తాను. పరిశుభ్రత విశ్వాసములోని ఒక భాగము. దీనిని మనము సదా గర్తుంచుకోవలెను. స్నానగదులు, మరుగుదొడ్ల శుభ్రత విషయంలో సేవకులతో పాటు అతిథులు కూడ ప్రత్యేక దృష్టి చూపుతూ వాటిని తుడిచి రాగలరు. ఒకరి తరువాత మరొకరు అందులోకి వెళ్ళుటకు వీలు లేనంతగా నీరు నిలుస్తుందని నాకు ఫిర్యాదులు అందాయి. సేవకుల బాధ్యతయే అయినను దీనిని కేవలం సేవకుల వరకే పరిమితం చేయకూడదు. స్వయముగా

అతిథులు కూడ ఈ విషయంలో వారికి సహకరించవలెను. ఇదే విధముగా రహదార్లు, లోపలి మార్గములపై గ్లాసులు పడివున్నచో లేదా మైదానములో గ్లాసులు లేదా టిన్నులు మొదలగు వస్తువులు కనిపించినచో, వాడిన సంచులు మొదలగునట్టివి పడివున్నచో వాటిని తీసి చెంత కుండిలో పడవేయగలరు. నేటి రోజులలో గుర్తుంచుకోవలసిన మరో ముఖ్యమైన విషయమేమనగా, గడ్డి చాలా ఎండిపోయి ఉన్నది. ఇలాంటి పరిస్థితులలో మంటలు అంటుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దానిని కోసి వేరక చోటు వేసి తగిన రక్షణ చర్యలు తీసుకోవడం జరిగింది. కాని ప్రమాదాలకు అవకాశం కూడ లేకపోలేదు. కావున తగిన జాగ్రతలు తీసుకోవాలి. కావున డ్యూటిలు చేయువారు, అతిథులు అందరు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. నిప్పును రాజేయు వస్తువులను, నిప్పు మంటలను నేలపై వేయకూడదు. మొత్తానికి ఇదొక వాస్తవం కావున వాస్తవాన్ని తెలుపడం సమంజసమే ఫలితముగా నష్టం జరుగకుండా ఉంటుంది. ఒకవేళ ఎవరికైన సిగిరెట్ త్రాగే అలవాటు ఉన్నచో వారు ఈ రోజులలో హదీఖతుల్ మహ్దీ ప్రాంగణంలో నుండి దూరంగా వెళ్ళి సిగిరెట్ త్రాగవలెను. ఇలా చెప్పినందుకు నేను మీకు సిగిరెట్ త్రాగుటకు అనుమతి నిచ్చానని, దానిని చెడుగా భావించకూడదని ఆలోచించకూడదు. మొత్తానికి ఇది ఒక చెడు అలవాటు. దీనిని వదిలి వేయుటకు సాధ్యమైనంత వరకు ప్రయత్నించాలి. ఈ విషయంను గూర్చి ఖుత్బాలు కూడ ఇవ్వడం జరిగింది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దీనిని నివారించకున్నను, దీనిని అయిష్టపడేవారు. కొన్ని సందర్భాలలో అయిష్టతను వ్యక్తపర్చిరి. ఇలాంటి అలవాటు వదిలి వేయాలని సూచించిరి. (మల్ఫూజాత్ సంపుటి 5, పుట 235) ఏ యువకులైతే ఇలాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిపోతారో, కొందరికి సమాజం అలవాటు చేస్తుంది. మొత్తానికి ఇది చెడు అలవాటని, తప్పుడు పని అని, అయిష్ట కార్యమని, పాపమని తెలుసుకోవాలి.

ఇంకా రక్షణపరంగా తమ పరిసరాలను చుట్టు ప్రక్కల గమనిస్తుండాలి. సభా ప్రాంగణములో లేక బయట ఎవరైనా దుష్టులు ఇబ్బంది కలిగించవచ్చును. ఈ విషయమును దృష్టియందుంచుకోవలెను. ఏదేని అనుమానాస్పద వస్తువును చూచినా లేదా అనుమానాస్పద కదలికలు గమనించినను వెంటనే నిర్వహకులకు లేదా సమీపములో వున్న సేవకులకు సమాచారమందించగలరు. మహిళలు కూడ ఈ విషయం పట్ల తగిన శ్రద్ధ చూపాలి. మహిళలు ముసుగు ధరించి లేదా బురఖాలు వేసుకొని జల్సా ప్రాంగణములోకి రాకూడదు. ప్రవేశ ద్వారముల వద్ద స్కానింగ్ సరిగా చేయవలెను. ఇందుకోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలి. ఈ క్రమములో అతిథులకు ఆలస్యమైనచో కొంత మేరకు ఓర్పు పట్టగలరు. సహనంను పాటించగలరు. రక్షణ పరమైన చర్యలు తీసుకోవడం చాలా అత్యవసరం.

మహిళల నుండి కొన్ని ఫిర్యాదులు అందుతుంటాయి. పిల్లలు గల తల్లులకు కేటాయించిన ప్రాంతములో పిల్లలను తల్లులు ఏ విధముగా నిశబ్ధముగా ఉంచుతారు. ఫలితముగా పిల్లలు ఏదో ఒకటి తింటూ ఉంటారు లేదా ఏదేని ఆట వస్తువులతో ఆడుకుంటారు. ఆ సమయంలో తల్లుల తమ పిల్లలను నిశబ్ధపర్చి ఇకపై మాట్లాడడం అల్లరి చేయడం తమ వంతని భావిస్తుంటారు. కొన్ని సందర్భాలలో జల్సా ఉపన్యాసాల మధ్యలో మాట్లాడుకుంటారు. ఫలితముగా అల్లరి ఎక్కువగా వినిపిస్తుంది. నిశబ్ధముగా ఉపన్యాసాలను వినాలని కూర్చున్న ఇతర తల్లులను కూడ వినకుండా చేస్తుంటారు. కావున మహిళ సేవకురాలు, ఆ ప్రాంతములో డ్యూటి చేయువారు అందరు ఈ విషయాన్ని దృష్టియందుంచుకోవాలి. పిల్లల ప్రాంగణంలో పిల్లల అరుపులు సహించవచ్చును కాని వారి తల్లుల అరుపులను మాత్రం ఏ మాత్రం సహించబడదు. అంతేగాకా కొందరు మహిళలు ముఖ్య మహిళ ప్రాంగణంలో కూడ మాట్లాడుకోవడం జరుగుతుందని ఫిర్యాదులు వస్తుంటాయి. నిశబ్ధమని సూచించే బాలికల పట్ల దురుసుగా వ్యవహరిస్తారు. ఏ విధముగా కూడ ఆమోధ యోగ్యం కాని సమాధానములను ఇస్తుంటారు. కావున మహిళలు సేవలందించుచున్న బాలికలకు సహకరించవలెను.

సభతో అధికాధికముగా ప్రయోజనము పొందుటకు అల్లాహ్ తఆలా అందరిని అనుగ్రహించుగాక! నేను ఇప్పుడు చూపించిన సూచనలను, మార్గదర్శకాలను లేదా మీ కార్యక్రమాల పుస్తకములో సూచించిన వాటిని పాటించు భాగ్యమును కూడ అల్లాహ్ తాలా మనకు కల్పించుగాకా! కాని అన్నింటికన్న ముఖ్యమైనది, ఈ సూచనలు, మార్గదర్శకాలపై ఆధిక్యత గలదు మరొకటి గలదు అది దుఆ. జల్సా విజయవంతమగుటకు ప్రత్యేకముగా అందరు దుఆ చేయగలరు. అల్లాహ్ తఆలా తన శుభముతో మాత్రమే సభను అన్ని విధాలా విజయవంతము చేయుగాక! ప్రతి ఇబ్బంది నుండి రక్షించుగాక! మనమిక్కడ ఏ ప్రయోజనము కొరకు సమావేశమైనామో దానిని పొందువారమగుదము గాక! (ఆమీన్)

అదే విధముగా నేను మరొక విషయమును కూడ మీకు తెలియజేస్తున్నాను. రివ్యూయు ఆఫ్ రిలీజియన్స్ ఆధ్వర్యంలో ప్రతి సారి లాగే ఈ సంవత్సరము కూడ ప్రదర్శన శాలను ఏర్పాటు చేశారు. అదే విధముగా అక్కడ అల్ ఖలమ్ ప్రాజెక్ట్ కూడ గలదు. పురాతత్వ శాఖ తరుపున కూడ ప్రదర్శన శాల ఏర్పాటు చేయబడినది. అది కూడ చూడదగినది. అదే విధముగా యు.కే జమాఅత్ ప్రచార శాఖ వారు పవిత్ర ఖుర్ఆన్‌ల ప్రదర్శనను కూడ నిర్వహిస్తున్నది. ఈ ప్రదర్శనకూడ ప్రజలకు ప్రయోజనం చేకూర్చునని ఆశించడమైనది. అదే విధముగా రెండు క్రొత్త వెబ్‌సైట్‌లను కూడ ప్రారంభించడం జరిగింది. ట్రూ ఇస్లాం, రెస్పెల్ రిలీజియన్. ప్రచార శాఖ వారు ఆన్‌లైన్ ద్వారా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రపై ఉపన్యాసాల పోటిని నిర్వహిస్తున్నది. అందులో కూడ ప్రజలు పాల్గొంటున్నారు. ప్రత్యేకించి ఈ రోజు నుండే వారు ఆ కార్యక్రమమును ప్రారంభించారు. మొత్తానికి చాలా కార్యక్రమాలు, విషయాలు గలవు. వీటన్నింటి నుండి ప్రజలు ప్రయోజనం పొందగలరు. అల్లాహ్ తాలా పాల్గొన్న వారందరికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆలకు అర్హులను చేయుగాకా! (ఆమీన్)






(2 వ పేజి తరువాత చదువుము. )

కాక ప్రతి ఉదయించు దినము وَلَلْآخِرَةُ خَيْرٌ لَّكَ مِنَ الْأُولَىٰ (అజ్జుహా:5) అనగా నిశ్చయముగా పరలోకము నీ కొరకు ప్రతి మొదటి స్థితి కంటే ఉత్తమమైనది. ఆచరణాత్మక విశ్లేషణ అగుచు అంకిత మైదానములో جان دی دی ہوئی اُسی کی تھی حق تو یہ ہے کہ حق ادا نہ ہوا అతడే ప్రాణమిచ్చెను. కాని సరైన హక్కు చెల్లించలేదని ప్రకటించుచు ప్రాణ, ధనమే గాక అన్ని రకాల త్యాగములను దైవ మార్గములో సమర్పించుచు విశ్వసనీయతపు నూతన అధ్యాయమును లిఖించుచున్నారు. وَذَالِكَ فَضْلُ اللهِ فَالْحَمْدُ لِلهِ عَلىٰ ذَالِكَ.

శ్రోతలారా! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను అల్లాహ్ ఇస్లాం పునరుజ్జీవము కొరకు, ఇస్లాం వ్యాప్తికి, ఇస్లాం విజయమునకు పంపెను. ఇస్లాం మూలమును ప్రపంచములో మరల స్థాపించుటకు తమ సంస్థను పదే పదే ఇట్లు ఉపదేశించిరి. ఇందుకు జీవితాంకిత మైదానములో మనము గొప్ప గొప్ప త్యాగములు సమర్పించుటను ఇస్లాం విజయము మనతో కోరును. ఇస్లాం విజయ ఆసక్తికర దృశ్యమును మనముందుంచుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించిరి.

"సత్యము జయించును. గతములో వచ్చిన తాజాదనపు, కాంతివంతమైన రోజు ఇస్లాం కొరకు మరల వచ్చును. గతములో ఉదయించినట్లు ఆ సూర్యుడు సంపూర్ణముగా మరల ఉదయించును. కాని ఇప్పుడే కాదు. ప్రయత్నము, కష్టముతో మన కాలేయము రక్తసిక్తము కానిదే, దాని కొరకు సర్వ విశ్రాంతులను మనము పోగొట్టు కోనిదే, ఇస్లాం కొరకు సర్వ అవమానములను స్వీకరించనిదే ప్రత్యక్షము కాకుండా ఆకాశము దానిని నిరోధించును. ఇస్లాం జీవించుటకు మనతో ఒక దానమును కోరుచున్నది. అదేమిటి ? ఈ మార్గములోనే మనము మరణించుట. ఈ మరణముపైనే ఇస్లాం జీవితము, ముస్లిముల జీవితము, అల్లాహ్ ఉనికి ప్రకాశము ఆధారపడి యున్నది. దీని పేరే మరో రకంగా ఇస్లాం అనబడును".

(ఫతహ్ ఇస్లాం - రూహానీ ఖజాయిన్ సంపుటి 3 పుట 10-11)

శ్రోతలారా! ఇస్లాం కొరకు జీవితమును అంకితము చేయు కోరిక, ఉత్సాహము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు యుండెను. జీవితమును అంకితము చేయుటలో అల్లాహ్ వారికి ప్రత్యేక ఉత్తేజము ప్రసాదించి యుండెను. దానిని వారిట్లు తెలిపిరి.

"స్వయాన నేను ఈ మార్గములో అనుభవము గలవాడిని. కేవలము అల్లాహ్ అనుగ్రహము, శుభముతో నేనీ అభిరుచి, సారస్వముతో ఎంతో ఆనందము పొందినాను. దైవ మార్గములో జీవితమును అంకితము చేయుటకు మరణించి మరల బ్రతికినచో, మరల మరణించి మరల బ్రతికినచో ప్రతి సారి నా ఉత్సాహము అభిరుచితో పెరుగుచూనే పోవును".

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 370)

ఏదో ఒక రూపంలో జీవితమును అంకితము చేయు వ్యవస్థ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలము నుండే అహ్మదియ్య సంస్థలో కొనసాగుచున్నది. ద్వితీయ ఖలీఫా హయాంలో ఇందులో ఒక క్రమ పద్ధతి ఏర్పడినది. ఈ పద్ధతిని నూతన వైభవముతో ఏర్పరచుచు హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ రాబె రహ్మహుల్లాహ్ అన్‌హు తమ దూరదృష్టితో భవిష్యత్తులో ఇస్లాం ప్రచార మైదానములో అవసరమగు అసాధారణ అవసరాలను గుర్తించుచు క్రీ.శ.1987 లో 'వఖ్ఫె నౌ' (జీవితాంకిత) పథకమునకు బీజము వేసిరి. اَلْحَمْدُ لِلهِ. నేడీ బీజము ఒక మహా వృక్షముగా ఎదిగినది. మొత్తము ప్రపంచము నుండి వేలాది సంఖ్యలో జీవితాంకితులు ఇస్లాం సేవకు కంకణం కట్టుకొన్నారు.

నేడు భూభాగంపై ఒక్క అహ్మదియ్య సంఘములోనే తల్లులు హజ్రత్ మర్యమ్ ఆదర్శమును జీవింపజేయుచు జన్మించక ముందే తమ పిల్లలను దైవ మార్గములో సమర్పించుచున్నారు. కేవలము అహ్మదియ్య సంస్థలోనే హజ్రత్ ఇబ్రాహీమ్ పద్ధతిలో తమ కుమారులకు శిక్షణ ఇచ్చే తండ్రులు ప్రసాదించబడిరి. బాలలు యవ్వనమునకు చేరుకోగానే హజ్రత్ ఇస్మాయీల్ వలె اِفْعَلْ مَا تُؤْمَرُ అనుచు ఇస్లాం సేవ కొరకు తమ జీవితమును ఒక దృఢ సంకల్పముతో అంకితము చేయుచున్నారు.

శ్రోతలారా! ధార్మిక విద్యను పొంది ప్రపంచమునకు మార్గదర్శనము చేయుటకు జీవితాంకిత విశ్వాసులలో ఒక వర్గమును ఏర్పాటు చేయవలెనని పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

وَمَا كَانَ الْمُؤْمِنُونَ لِيَنفِرُوا كَافَّةً فَلَوْلَا نَفَرَ مِن كُلِّ فِرْقَةٍ مِّنْهُمْ طَائِفَةٌ لِّيَتَفَقَّهُوا فِي الدِّينِ وَلِيُنذِرُوا قَوْمَهُمْ إِذَا رَجَعُوا إِلَيْهِمْ لَعَلَّهُمْ يَحْذَرُونَ

(అత్తౌబహ్:122) అనగా విశ్వాసులు మొత్తానికి మొత్తము కలిసికట్టుగా బయలు దేరుట అసాధ్యము. కనుక వారు ధర్మజ్ఞానము పొందుటకు, తన జాతి వారిని జాగరూకులుగా చేయుటకు ప్రతి వర్గము నుండి ఒక పక్షము బయలు దేరవలయును. వారు వారి వైపు తిరిగి వచ్చినప్పుడు బహుశః వారు నాశనము నుండి రక్షింపబడుదురేమో!.

పవిత్ర ఖుర్‌ఆన్ ఆదేశము మేరకు ధార్మిక విద్య, ఇస్లాం ప్రచారము కొరకు సమర్పితుల ఆధ్యాత్మిక సైన్యమును సిద్ధము చేయుటకు ఈ జీవితాంకితుల విద్యాభ్యాసం, వారి శిక్షణ కొరకు సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం క్రీ.శ. 1906లో తాలీముల్ ఇస్లాం పాఠశాలలో "ధార్మిక విభాగము"ను ఏర్పాటు చేసిరి. అనంతరం అది 'మదర్స అహ్మదియ్య' పేరున ఖ్యాతి చెందినది. నేడు 'జామిఅ అహ్మదియ్య' పేరున ప్రపంచ వ్యాప్తముగా పేరు ప్రతిష్టలు పొందినది.

ఈ పవిత్ర విద్యాలయ స్థాపన ముఖ్య ఉద్దేశము, కారణమునకు గల నేపథ్య భయమును సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు వ్యక్త పరచిరి. వారిట్లనిరి.

"మన సంస్థలో గొప్ప వ్యక్తులు మరణించుచున్నారు. గొప్ప విధేయులైన మౌల్వీ అబ్దుల్ కరీమ్ గారు, మౌల్వీ బుర్హానుద్దీన్ గారు జీహ్‌లుమ్ మృతి చెందిరి. ఇటులనే ఇతర చాలా మౌల్వీలు మృతి చెందుచున్నారు. కాని విచారమేమనగా మృతి చెందుచున్న వారి ఉత్తరాధికారులు మాకు కనిపించడం లేదు". (తారీఖె అహ్మదియ్యత్ సంపుటి 2 పుట 412)

గౌ॥ శ్రోతలారా! ఇమాముజ్జమాన్ ద్వారా స్థాపించబడిన ఈ విద్యాలయపు ఒక ఆసక్తికరమైన దృశ్యమును చూచుటకు రండి! ఇది

## ప్రత్యేక ప్రార్థనల విజ్ఞాపణ

అసత్య కేసులలో చిక్కింపబడి సంవత్సరముల కొలది ఖైదీలుగా పాకిస్తాన్ జైళ్ళలో ఉన్న మన పీడిత అహ్మదీయులందరిని అల్లాహ్ తాలా తన అనుగ్రహముతో గౌరవప్రదంగా విడుదల చేసి వారందరికి తన కరుణ, కటాక్షములతో రక్షణ కల్పిస్తూ వారికి తారసపడే దుష్టముల నుండి రక్షించు గాక ! ఆమీన్

జమాఅత్ సభ్యులందరు ఇందు కొరకు ప్రత్యేక దుఆలు చేయగలరు,

***"అల్లాహుమ్మ ఇన్నా నజ్అలుక ఫీ నుహూరిహిం వనవూజుబిక మిన్ షురూరిహిం"***

ఎంత గొప్ప స్థాయి గల విద్యాలయమో, విద్యార్థులు ఎంతటి గొప్ప ఆధ్యాత్మికత కలిగి, దైవ ప్రేమికులుగా యుండిరో తెలియును. హజ్రత్ హాఫిజ్ రౌషన్ అలి రజియల్లాహు అన్హు ఇట్లనిరి.

"ఒక సారి నేనింకా భుజంచలేదు. పాఠము కొరకు నిరీక్షించుచుండగా భోజన సమయము దాటి పోయెను. ఇంతలోనే మా హదీస్ పాఠము మొదలయ్యెను. నేను నా ఆకలిని లెక్క చేయక పాఠములో నిమగ్నమైపోతిని. పాఠము చదువుచున్న విద్యార్థి ధ్వనిని నేను స్పష్టముగా వినుచుంటిని. అంతా చూచుచుంటిని. ఒక్కసారిగా పాఠపు ధ్వని నెమ్మిగించెను. నేను జాగరూకునిగా వున్నను నా చెవులు వినకుండా, నేత్రములు చూడకుండా అయిపోయినవి. ఈ స్థితిలో ఒకడు నెయ్యితో చేసిన రొట్టెలు, ఏంచిన మాంసముతో కూడిన, సర్వం సిద్ధం చేసిన భోజనము నా ముందు తీసుకొచ్చి పెట్టెను. నేను ఎంతో అభిరుచితో భుజించడం మొదలు పెట్టినాను. నేను పుష్టిగా భుజించిన తర్వాత ఈ స్థితి మారిపోయినది. అనంతరం నాకు పాఠపు ధ్వని వినిపించడం మొదలైనది. నేను భుజించినట్లు నా శరీరము బరువెక్కినట్లు భావించుచుంటిని. నిజముగా భోజనము చేసిన తార్వత కలిగే ఆనందము, తృప్తి నాకు కలిగెను. వాస్తవానికి నేనెక్కడికి పోలేదు, నేను భుజించుచున్నట్లు నన్నెవరు చూడలేదు".

(కలామె అమీర్ పుట 50 31 అక్టోబర్ 1912)

విద్యార్థి ఈ స్థితి ఉపాధ్యాయునికి కూడ తెలిసెను. కనుక హజ్రత్ మౌలానా నూరుద్దీన్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. "నా ఉపన్యాసము జరుగుచుండగా హాఫిజ్ రౌషన్ అలి ఆకాశ బోజనము ఆరగించెను. జాగారములోనే రొట్టెలు, కబాబ్ భుజించెను".

శ్రోతలారా! ఇమాముజ్జమాన్ ద్వారా స్థాపించబడిన ఈ విద్యా విభాగము 'జామిఅ అహ్మదియ్య' రూపంలో పవిత్ర ఖుర్‌ఆన్ ప్రస్తావించిన పవిత్ర వృక్షము వలె తన వేర్లను ప్రపంచములోని వివిధ దేశములలో గట్టిగా స్థాపించుకొనినది. దీని శాఖలు ఆకాశమునకు తాకుచున్నవి. దైవ వాగ్దానము మేరకు تُؤۡتِیۡۤ اُکُلَهَا کُلَّ حِیۡنٍۭ بِاِذۡنِ رَبِّهَا దీని తియ్యని ఫలములతో ప్రపంచము ప్రయోజనము పొందుచున్నది.

శ్రోతలారా! వృక్షము తన ఫలములతో గుర్తించబడును. ఈ జామిఅ నుండి విద్యాభ్యాసం పొందిన పండితులు ప్రపంచములో విప్లవం సృష్టించిరి. యూరప్, అమెరికా, ఆసియా, ద్వీపములలో ఏ భూభాగమును దైవ ఏకత్వ సందేశము అందించనిదే వదలలేదు. వర్తమాన ఖలీఫా దృఢ సహాయకులుగా నుండి ప్రచార, శిక్షణ మైదానములో విజయము, సఫలముతో కూడిన ప్రపంచములోని ఏ జాతిలో లభించని చరిత్ర సృష్టించుచున్నారు. ఈ విద్యాలయము శుభముతో అల్లాహ్ అహ్మదియ్య సంస్థకు విజయము పొందిన సైనికాధిపతుల రూపంలో ఖాలిదీన్‌లను అందించెను. వీరిని సైనికాధిపతులుగా సత్య శత్రువుల ముందు ప్రవేశపెట్టుచు వాగ్దత్త ఖలీఫతుల్ మసీహ్ హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు ఇట్లనిరి.

"హజ్రత్ ఖలీఫతుల్ అవ్వల్ ఖిలాఫత్ కాలములో దాడులు జరుగుచున్నప్పుడు గర్వపడకుము. మీ తలలను (నిదర్శనములతో) విరగ్గొట్టుటకు నా వద్ద ఖాలిద్లు వున్నారని హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజియల్లాహు అన్హు అనిరి. కాని అప్పుడు నేను తప్ప ఏ ఖాలిద్ లేకుండెను. కానిప్పుడు ఆ ఖాలిద్లు లేరని భావించకుము. ఇప్పుడు మన సంస్థలో అప్పటి కంటే ఎక్కువ ఖాలిద్లు వున్నారు. ఉదా॥ షంస్ గారున్నారు. మౌల్వీ అబుల్ అతా గారున్నారు. అబ్దుర్రహ్మాన్ ఖాదిమ్ గారున్నారు. వీరు శత్రువుల నోరు మూయించే సమాధానములు ఇవ్వగలరు. ఇన్షాఅల్లాహ్. ఇత్తురు కూడ. అల్లాహ్ వీరి కలము, వాక్యములో అధికాధికముగా శుభము కల్గించును". (అల్‌ఫజల్ రబ్వా 15 మార్చి 1957)

గౌ॥ శ్రోతలారా! వాస్తవానికి జీవితాంకితులు, వఖ్ఫె నౌ వారు ఖలీఫాకు గట్టి సహాయకులు. నిజమైన రీతిలో వర్తమాన ఖలీఫాయె వారి త్యాగములు దైవ సన్నిధిలో ఆమోదించబడుటకు మార్గదర్శనము చేయును. నాధి హృదయమును అనుసరించునట్లు జీవితాంకితులు వర్తమాన ఖలీఫాకు సంపూర్ణ విధేయులుగా నుండవలెను.

జీవితాంకిత నిజమైన భావమును తెలుపుచు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబె రహ్మాహుల్లాహ్ ఇట్లనిరి.

"وَأَرِنَا مَنَاسِكَنَا وَتُبْ عَلَيْنَآ భావము జీవితాంకిముతో గట్టి సంబంధము గలది. అంకితము స్వీకరించబడిన తర్వాత ఈ దుఆ నేర్పించెను. నీవు మమ్ములను ఎన్నుకొనినందున మేము నీ కొరకు అంకితమైనాము. కనుక నీవు మమ్ములను సేవకు నియమించుము. ఈ ఈ త్యాగములు చేయమని, ఇవి ఇవి మీ త్యాగస్థానములు మాకు చెప్పుము. తర్వాత మాతో అలసత్వములగును, లోపములగును, నీ ఆదేశమును నీ కోరిక మేరకు పూర్తి చేయలేము. అప్పుడు మమ్ములను క్షమించవలెను. పొరపాట్ల నుండి పదే పదే మమ్ములను క్షమించుము".

(ఖుత్బ ఈదుల్ అజ్‌హియ 5 ఆగస్టు 1987)

శ్రోతలారా! అహ్మదియ్య సంస్థ ప్రపంచవ్యాప్త విజయములకు నిర్వచనమని ఈ ఐదవ ఖిలాఫత్ ఆరంభము నుండే సూచనలిచ్చుచున్నది. ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిచ్చుట గురించి హుజూర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 17 అక్టోబర్ 2014వ తేదీన సంస్థను ప్రత్యేకంగా సూచించుచు ఇట్లనిరి.

"ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిచ్చుటతోనే బైఅత్ ఉద్దేశము పూర్తి అగును. దీని భావమును పొందుటకు ప్రపంచ పనులతో పాటు ధార్మిక విద్యను పొందడం, దానిని ఆచరించడం కూడ తప్పనిసరి. ...గొప్ప ఉద్దేశమును పొందుటకు ఆలోచనను కూడ గొప్పగా చేసుకోవలసిన అవసరమున్నది. స్వార్థము కొరకు కాదు అల్లాహ్ ప్రీతిని పొందుటకు త్యాగము చేయవలెను. ఇస్లాం అందమైన సందేశమును ప్రపంచమునకు అందించు బాధ్యత మనకు అప్పగించబడినది. దీనిని మనము నిర్వర్తించవలెను".

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ వఖ్ఫె నౌ వీరులు అత్యధికంగా, అధిక సంఖ్యలో జామిఅ అహ్మద్యిలో ప్రవేశము పొంది ధార్మిక అవగాహన, చింతన పొంది దేవుని వైపు ఆహ్వానించు మైదానములో సేవలందించాలని అతి గొప్ప రీతిలో సూచనలిచ్చుచున్నారు. హుజూర్ ఇట్లనిరి.

"ప్రపంచములో ధర్మమును వ్యాపింపజేయుటకు ధార్మిక విద్య


**నూరుల్ ఇస్లాం వేళలు**

ప్రతి రోజు ఉ॥ 9:00 నుండి రాత్రి 11:00 వరకు
ప్రతి శుక్రవారము సెలవు
టోల్ ఫ్రీ నెంబర్ : 1800 3010 2131
ఈ టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించుచు జమాఅతే అహ్మదియ్యను గూర్చి వివరములు తెలుసుకోగలరు.
web: www.alislam.org,
www.ahmadiyyamuslimjamaat.in

అవసరమని నేను మరల సూచించుచున్నాను. ధార్మిక విద్య బోధించు ఉద్దేశముతోనే స్థాపించబడిన సంస్థ ద్వారనే ఈ విద్య ఎక్కువ లభించును. అహ్మదియ్య సంస్థలో ఈ సంస్థ జామిఅ అహ్మదియ్య పేరున గుర్తింపు పొందినది. కనుక నూతన జీవితాంకితులు అధికముగా జామిఅ అహ్మదియ్యలో చేరవలెను.''

మరల ఇట్లనిరి.

''జామిఅ అహ్మదియ్యలో ప్రవేశించే వారిలో జీవితాంకితులు అధికముగా యుండవలెను. మన ముందు మొత్తం ప్రపంచపు మైదానము యున్నది. ఆసియా, ఆఫ్రీకా, యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా, ద్వీపములు, ప్రతి ప్రాంతమునకు మనము చేరవలెను. ప్రతి ప్రాంతము, ప్రతి ఉపఖండములోనే కాదు, ప్రతి దేశములోనే కాదు, ప్రతి నగరములోనే కాదు, ప్రతి పట్టణములో, గ్రామములో, ప్రపంచములోని ప్రతి వ్యక్తి వరకు ఇస్లాం అందమైన సందేశమును అందించవలసి యున్నది. ఈ కార్యమును కొందరు ప్రచారకులు నిర్వర్తించలేరు''. **(ఖుత్బ జుమా 18 జనవరి 2013)**

హుజూర్ జీవితాంకితులు ధార్మిక విద్యను పొందవలెనని సూచించుచూనే మరో వైపు ఈ సంతానమును తీర్చిదిద్దవలసిన బాధ్యత గల తల్లిదండ్రులకు గొప్ప శిక్షణనిచ్చే సూచనలు కూడ ఇచ్చుచున్నారు. వారిట్లనిరి.

''ఈ జీవితాంకితులు తెలివి తేటల దశకు చేరినప్పుడు సంస్థ కార్యక్రమములలో పాల్గొనునప్పుడు వారు తమను తాము ధార్మిక సేవ కొరకు మాత్రమే సమర్పించవలెనని ఒకే ఒక్క ఆలోచన వారి మెదడులో యుండవలెను. మీ జీవిత ఉద్దేశము ధార్మిక విద్య పొందడమేనని అధికముగా బాలల మెదడులో వేయవలెను. ధార్మిక విద్యాభ్యాసం కొరకు సంస్థ ధార్మిక సంస్థలలో ప్రవేశించుట అనివార్యమని బాలల మెదడులో ఆలోచన కలిగించవలెను. జామిఅ అహ్మదియ్యలో ప్రవేశించు వారి సంఖ్య అధికముగా యుండవలెను''. **(ఖుత్బ జుమా 18 జనవరి 2013, మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్)** మరల హుజూర్ ఇట్లనిరి.

''అల్లాహ్ సంతానము శిక్షణ కొరకు ఇతర పద్ధతులను సృష్టించవచ్చును. కాని తల్లిదండ్రులే శిక్షణ ఇవ్వవలెనని అతడు చెప్పెను. వీరు ధర్మమునకు ఉపయోగపడుటకు తమ స్థితి ప్రకారము గొప్ప ఉద్ధేశమును పొందుటకు వినియోగించుము. తమ పిల్లలు ధార్మిక పనులకు ఉపయోగపడే విధముగా శిక్షణనిచ్చుట అహ్మదీ తల్లిదండ్రుల అతి పెద్ద కర్తవ్యము. అప్పుడే ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిచ్చు విషయము, ప్రతిజ్ఞ పూర్తి అగును. ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిచ్చు ఆలోచన వారికి బాల్యము నుండే కలిగేటట్టు శిక్షణ ఇవ్వుము. అల్లాహ్ ఈ విషయములను మనకు అప్పగించి పరీక్షించును, బహుకరించును కూడ''. **(ఖుత్బ జుమా 17 అక్టోబర్ 2014)**

శ్రోతలారా! జీవితాంకిత ప్రాముఖ్యత విధితమే. దీని శుభములు అనంతమైనవి. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇట్లు తెలిపెను.

إِنَّ الَّذِينَ قَالُوا رَبُّنَا اللَّهُ ثُمَّ اسْتَقَامُوا تَتَنَزَّلُ عَلَيْهِمُ الْمَلَائِكَةُ أَلَّا تَخَافُوا وَلَا تَحْزَنُوا وَأَبْشِرُوا بِالْجَنَّةِ الَّتِي كُنتُمْ تُوعَدُونَ

**(హామీమ్ అస్సజ్దా:31)** అనగా నిశ్చయముగా మా ప్రభువు అల్లాహ్, అనుచు, నిలకడగా వుండు, వారిపై తరుచుగా దేవదూతలు ఇట్లనుచు అవతరింతురు. భయపడకుము. దుఃఖించకుము. ఈ స్వర్గము లభించినందులకు సంతోషించుము. దీని వాగ్దానము మీతో చేయబడుచున్నది.

శ్రోతలారా! సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దైవవాణి 'నీవు నా వాడైనచో ప్రపంచమంతా నీదే' ఈ సూక్తి భావనమును స్పష్టముగా వివరించును. అనగా మొత్తం ప్రపంచ పోషకునికి మానవుడు తమ జీవితమును సమర్పించినప్పుడు అల్లాహ్ అతని కొరకు మొత్తం ప్రపంచమును ధారపోయును. అతడు దైవ అనుగ్రహములు, కరుణలు, శుభములకు వారసుడగును. నిజమైన సంఘటనల ప్రపంచములో దిగి ప్రచార మైదానములో దైవ సహాయముల విశ్వాసభరిత కాంతులను తిలకించుటకు వెళ్లెదము రమ్ము.

జీవితాంకితుల విజయము అల్లాహ్ అనుగ్రహముపై ఆధారపడడమే కాక అసాధారణ రీతిలో వారి ప్రార్థనపై కూడ ఆధారపడి యుండును. అల్లాహ్ వారి ప్రార్థనలను ప్రత్యేకముగా ఆమోదించును. ఒక్కో సారి జీవితాంకితుని జీవితమునకు సంబంధించిన ప్రార్థనల ఆమోదముతో ఇతరుల విశ్వాసమును దృఢపరచును. మరోసారి జీవితాంకితుల ప్రార్థనలను ఇతరుల కొరకు ఆమోదించి వారి మార్గదర్శనమునకు కారణమగును.

మౌలానా నజీర్ అహ్మద్ ముబష్షిర్ గారు ఘానాలో యుండగా వ్యతిరేకులు ఇమామ్ మహ్దీ అవతరించినచో భూకంపము సంభవించవలెనని వాదించిరి. వాస్తవానికి సత్య నిరూపణకు ఇది ప్రమాణము కాదు. ఇటువంటి భవిష్యవాణి కూడ లేకుండెను. కాని వారు ఓ అల్లాహ్ నీవు శక్తిమంతుడవు! నీ శక్తి చిహ్నమును చూపుమని నిరాడంబరతతో కోరిరి. దైవ మహిమ చూడండి! కొన్ని రోజులలోనే మొత్తం ఘానా భూభాగము భూకంపముతో కంపించెను. తద్వారా ఈ విషయము అనేకుల మార్గదర్శనము కొరకు ఉపయోగపడెను.

శ్రోతలారా! జీవితాంకిత ప్రచారకులు అనుక్షణం పూర్తిగా అల్లాహ్ రక్షణలో యుందురు. స్వయముగా అల్లాహ్ వారిని ప్రత్యేకముగా రక్షించును. ఇక్కడ నాకు హజ్రత్ మౌలానా రహ్మత్ అలి ఇండోనేషియా ప్రచారకుల సంఘటన గుర్తుకొచ్చెను. ఒక సారి అనుకోకుండా వారి వీధిలో అగ్ని వ్యాపించెను. ఇరుగు పొరుగులో నున్న గృహములను బూడిద చేయుచు వారి నివాసమునకు సమీపములో చేరెను. తుదకు అగ్ని రవ్వలు వారి నివాసముపై పడసాగెను. ఈ సున్నితమైన విషయమును చూసి మీరు వెంటనే గృహమును వదిలి వెళ్లమని ప్రజలు పట్టుబట్టిరి. కాని 'ఇన్షాఅల్లాహ్! ఈ అగ్ని మమ్ములను ఏమి చేయలేదు. ఈ గృహము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సేవకుని, దైవ మార్గములో పని చేయుచున్న వీరుని నివాసము, అగ్ని మా బానిసయే కాదు మా బానిసల బానిస అని హుజూర్‌కు అల్లాహ్ దైవవాణి అందించెను.'' అని వారు పూర్తి నమ్మకము, నిదానముగా చెప్పిరి. హజ్రత్ మౌలానా రహ్మత్ అలి గారింకా మాట్లాడుచుండగానే అకస్మాత్తుగా మేఘాలు కమ్ముకొనెను. కుండపోత వర్షము కురవడం మొదలయ్యెను. అది క్షణాల్లోనే అగ్నిని పూర్తిగా చల్లార్చినది.

జీవితాంకితుడు నమ్మకము, విశ్వాసముతో కూడిన గట్టి పర్వతముపై నిలుచును, ప్రపంచ శక్తులు దానికి తాకి ముక్కలు ముక్కలగునని మనకు ఈ సంఘటన ద్వారా తెలియును.

ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None
మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ

## జమాఅత్ సభ్యులు ఈ దుఆలను అధికముగా పఠించగలరు.

సయ్యుదినా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఅలా బినస్రిహిల్ అజీజ్ ఇంగ్లాండ్ వార్షిక బహిరంగ సభ మొదటి రోజు అనగా దివి: ఆగష్టు 3, 2018న ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తూ ఈ క్రింది దుఆలను మరియు దురూద్ షరీఫ్‌లను అధికముగా పఠించమని జమాఅత్ సభ్యులకు సూచించడం జరిగింది.

(1) اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى آلِ مُحَمَّدٍ كَمَا صَلَّيْتَ عَلٰى آلِ إِبْرَاهِيمَ وَعَلٰى آلِ إِبْرَاهِيمَ إِنَّكَ حَمِيدٌ مَّجِيدٌ اَللّٰهُمَّ بَارِكْ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى آلِ مُحَمَّدٍ كَمَا بَارَكْتَ عَلٰى إِبْرَاهِيمَ وعَلٰى آلِ إِبْرَاهِيمَ إِنَّكَ حَمِيدٌ مَّجِيدٌ۔

**1) అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వఅలా ఆలె ముహమ్మదిన్, కమా సల్లైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలె ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ అలా ఆలె ముహమ్మదిన్ కమా బారక్‌తా అలా ఇబ్రాహీమ వ అలా ఆలె ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్.**

అనువాదము: ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీమ్ మరియు ఇబ్రాహీమ్ సంతానంపై ప్రత్యేక అనుగ్రహము అవతరింపజేసిన విధముగా ముహమ్మద్ మరిము ముహమ్మద్ సంతానంపై కూడ తమ ప్రత్యేక అనుగ్రహమును అవతరింపజేయుము. నిశ్చయముగా నీవు సర్వగుణ సంపన్నుడవు, వైభవోపేతుడవు. ఓ అల్లాహ్! నీవు ఇబ్రామీమ్ మరియు ఇబ్రాహీమ్ సంతానంపై శుభములు అవతరింపజేసిన విధముగా ముహమ్మద్ మరిము ముహమ్మద్ సంతానంపై కూడ తమ శుభములను అవతరింపజేయుము. నిశ్చయముగా నీవు సర్వగుణ సంపన్నుడవు, వైభవోపేతుడవు.

(2) رَبَّنَا لَا تُزِغْ قُلُوبَنَا بَعْدَ إِذْ هَدَيْتَنَا وَهَبْ لَنَا مِنْ لَّدُنْكَ رَحْمَةً ۚ إِنَّكَ أَنْتَ الْوَهَّابُ (آل عمران:9)

**2). రబ్బనా లాతుజిఘ్ ఖులూబనా బాద ఇజ్‌హదైతనా వ హబ్‌లనా మిల్లదున్‌కా రహ్మతన్ ఇన్నక అంతల్ వహ్హాబ్ ( ఆలే ఇమ్రాన్: 9)**

అనువాదము: ఓ మా ప్రభువా! నీ ఉపదేశమును మేము పొందిన తరువాత మా హృదయములు చంచలములు కాకుండు గాక! మాకు నీ అనుగ్రహమును ప్రసాదింపుము. నిశ్చయముగా నీవు ఒక్కడివే వర ప్రదాతవు.

(3) رَبَّنَا اغْفِرْ لَنَا ذُنُوبَنَا وَإِسْرَافَنَا فِي أَمْرِنَا وَثَبِّتْ أَقْدَامَنَا وَانْصُرْنَا عَلَى الْقَوْمِ الْكٰفِرِينَ (آل عمران:148)

**3). రబ్బనా అఘ్ఫిర్‌లనా జునూబనా వ ఇస్రాఫనా ఫీ అమ్రినా వ సబ్బిత్ అఖ్‌దామనా వన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్. (ఆలే ఇమ్రాన్:148)**

అనువాదము: ఓ మా ప్రభువు మా పాపములను మరియు మా విధి నిర్వాహాన అవకతవకలను క్షమించుము. ( యుద్ధరంగమున) మడమ తిరుగని అడుగులను ప్రసాదించుము.అవిశ్వాసులతో మేము సల్పుచున్న పోరాటమునందు మాకు సహాయమును అందించుము.

(4) رَبَّنَا ظَلَمْنَا أَنْفُسَنَا ۜ وَإِنْ لَّمْ تَغْفِرْ لَنَا وَتَرْحَمْنَا لَنَكُونَنَّ مِنَ الْخٰسِرِينَ

**4). రబ్బనా జలమ్‌నా అన్ ఫుసనా వ ఇన్ లమ్ తఘ్ఫిర్‌లనా వ తర్ హమ్‌నా లనకూనన్న మినల్ ఖాసిరీన్ (ఆరాఫ్: 24).**

అనువాదము: ఓ మా ప్రభువా! మేము మా ప్రాణాలపై దౌర్భ్యము చేసుకున్నాము. ఒకవేళ నీవు మమ్ము క్షమించనిచో, మాపై కరునించనిచో మేము నష్టపోయేవార మగుదుము.

(5) رَبَّنَا آتِنَا فِي الدُّنْيَا حَسَنَةً وَّفِي الْآخِرَةِ حَسَنَةً وَّقِنَا عَذَابَ النَّارِ (البقرہ:202)

**5). రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతన్ వఫిల్ ఆఖిరతి హసనతన్ వఖీనా అజా బన్నార్ . (బఖ్రాహ్: 202)**

అనువాదము: ఓ నా ప్రభువా! మాకు ఈ ప్రపంచములో మంచిని ప్రసాదించుము, పరలోకములో శ్రేష్టతను అందించుము. మమ్ము నరకాగ్ని నుండి కాపాడుము.

(6) اَللّٰهُمَّ إِنَّا نَجْعَلُكَ فِي نُحُورِهِمْ وَنَعُوذُبِكَ مِنْ شُرُورِهِمْ

**6). అల్లాహుమ్మ ఇన్నా నజ్అలుకా ఫి నుహూరిహిం వ నవూజు బిక మిన్ షురూరిహం.**

అనువాదము: ఓ మా ప్రభువా! మేము నిన్ను శతుఋవుల ఎదుట డాలుగా చేసెదము, మరియు వారి దౌష్ట్య, హానికర ప్రభావాల నుండి నీ శరణమును కోరెదము.

(7) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِي وَانْصُرْنِي وَارْحَمْنِي (الہامی دعا حضرت مسیح موعودؑ)

**7). రబ్బి కుల్లి షైయిన్ ఖాదిముక,రబ్బి ఫ ఆఫిజ్‌ని,వన్‌సుర్‌ని,వర్ హమ్‌ని.**

అనువాదము: ఓ నా ప్రభువా! సమస్తం నీ సేవ కొరకై ఉన్నది. ఓ నా ప్రభువా! నన్ను రక్షించుము, నాకు సహాయం అందించుము, నన్ను అనుగ్రహింపుము.

## ఉపశాఖల వార్షిక సమావేశాల తేదీల ఆమోదము

సయ్యుద్నా హుజూరె అన్వర్ అయ్యుదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ భారత ఉపశాఖల 2018 వార్షిక సమావేశాలకు ఈ క్రింది తేదీలను తమ కరుణతో ఆమోదించినారు.

1. మజ్లిస్ అన్సారుల్లాహ్ భారత్ సమావేశము 12,13,14 అక్టోబర్ (శుక్రవారము, శనివారము, ఆదివారము) తేదీలలో జరుగను.

2. మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్య భారత్ సమావేశము 12,13,14 అక్టోబర్ (శుక్రవారము, శనివారము, ఆదివారము) తేదీలలో జరుగను.

3. లజ్న ఇమాఇల్లాహ్, నాసిరాతుల్ అహ్మదియ్య భారత్ సమావేశము 12,13,14 అక్టోబర్ (శుక్రవారము, శనివారము, ఆదివారము) తేదీలలో జరుగను.

శాంతి నిలయమైన ఖాదియాన్ ఆధ్యాత్మిక వాతావరణములో జరిగే ఈ సమావేశములలో పాల్గొనుటకు ఉపశాఖలకు చెందిన స్త్రీ, పురుషులు ఇప్పటి నుండే సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ సమావేశములు శిక్షణకు ఎంతో ఉపయోగపడును.


## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమునకు ఒక గొప్ప నిదర్శనము

وَلَوْ تَقَوَّلَ عَلَيْنَا بَعْضَ الْأَقَاوِيلِ۔ لَأَخَذْنَا مِنْهُ بِالْيَمِينِ۔ ثُمَّ لَقَطَعْنَا مِنْهُ الْوَتِينَ۔

అనగా కొన్ని విషయములను అతడు (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) మా వైపు అంటగట్టి యుండినచో మేమతినిని తప్పక కుడి చేతితో బంధించువారము. తరువాత నిశ్చయముగా మేము అతని మెడనరమును కోసివేయువారము. (అల్‌హాఖ్ఖహ్:45-47)

అహ్మదియ్య జమాఅత్ వ్యవస్థాపకులైన హజ్రత్ అఖ్దస్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్ మహ్ది మాహూద్ అలైహిస్సలాం ఇస్లాం సత్యము, ఆ(హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో తన ఆధ్యాత్మిక బంధము గురించి అనేక సార్లు అల్లాహ్ తఆలా ప్రమాణము చేయుచు నేను అల్లాహ్ తఆలా తరపున అవతరించితినని చెప్పినారు. ఇటువంటి ఎన్నో ఉ పదేశములను సమకూర్చి ఒక పుస్తకము

### "అల్లాహ్ ప్రమాణము"

పేరిట ప్రచురించబడినది. ఈ పుస్తకమును పొందుటకు ఔత్సాహికులు క్రింది చిరునామా/ఇ మెయిల్ ద్వారా సంప్రదించి ఉచితముగా పొందగలరు.

email: javidashu123@gmail.com
Mobile:98663 58609,75693 58609
Postal Address: Muhammad Javed Ahmad
H.No. 3-4-772, Opp: C.C.Shroff Hospital
BARKATPURA, KACHIGUDA, 500 027

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9493113322
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: badartel001@gmail.com

REGISTERED WITH THE REGISTER OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

The Weekly BADAR Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516

POSTAL REG NO GDP-38/2017-2019, Vol. 3. Thursday, 06 SEP 2018 Issue No. 36

MANAGER
NAWAB AHMAD
Tel : +91-1872-224757
Mobile. : +91 94170-20616
e-mail:managerbadrqnd@gmail.com
website:www.akhbarbadarqadian.in
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.500/- (Per Issue: 9/- ) (WEIGHT: 20-50, grms / issue)

# ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గుణగణాలు.

## " నబీయోంక సర్దార్ " పుస్తకము తెలుగు అనువాదంను అనుసరించి.

**మహిళలతో సత్ప్రవర్తనగా వ్యవహరించుట:-**

ఒకసారి యుద్ధ రంగమునందు ఏదో ఒక గందర గోళంతో ఒంటెలు, గుర్రాలు బెదిరిపోయినవి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ తమ గుర్రము నుండి పడిపోయిరి. కొందరు స్త్రీలు కూడ పడిపోయిరి. ఒక అనుచరుని ఒంటె రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక ఉండెను. రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పడిపోవుచు చూసి ఆ అనుచరుడు అందోళనకు గురై క్రింది దూకుచూ ఇట్లనుచూ వారి (స) వైపు పరుగెత్తెను. ఓ రసూలుల్లాహ్ ! నేను చనిపోయి మీరు జీవించుదురు గాకా!. రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పాదము గుర్రపు పల్లములో ఇరుక్కొని ఉన్నందున తొందరగా విడిపించుకొని ఆ అనుచరున్ని సంబోధించి ఇట్లనిరి. " నన్ను వదులుము. ముందు స్త్రీల సంగతి చూడుము. "

రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తమరి చివరి క్షణాలలో కూడ ముస్లిములందరిని సమావేశపరిచి ఉపదేశించిన విషయాలలో ఒకటి ఇట్లు గలదు. నేను మీకు చేయు చివరి ఆదేశమేమనగా మహిళలతో ఎల్లప్పుడు సత్ప్రవర్తనతో వ్యవహరించుము. వారు తరుచుగా ఇట్లనేవారు. ఇద్దరు కూతూర్లు ఉన్న గృహ యజమాని వారిని చక్కగా చదువించి, వారిని ఉత్తమ రీతిలో పెంచి పోషించినచో ప్రళయ దినమున అల్లాహ్ అతనిపై నరకమును నిషేదించును.

(తిర్మిజి సంపుటి 2, అబ్వాబుల్ బిర్రి వస్సిలహ్ బాబ్ మా జాఅ ఫిన్నఫ్ఖతి అల్ బనాతి.)

మహిళలు ఏదైనా తప్పు చేసినచో వారించి దండించే ఆచారము అరబ్బులలో ఉండేది. రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలిసినప్పుడు ఇట్లనిరి. స్త్రీలు అల్లాహ్ దాసులు, మీ దాసులు కారు. వారిని దండించకుము. కాని ఇంత వరకు స్త్రీల పూర్తి సంస్కరణ కానందున వారు ఈ ప్రోద్భలంతో పురుషులపై తిరగబడిరి. సంసార జీవితంలో అశాంతి మొదలయ్యెను. తుదకు హజ్రత్ ఉమర్ (రజి) రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లు ఫిర్యాదు చేసిరి. మీరు స్త్రీలను దండించకూడదని మమ్ము ఆదేశించిరి. వారు తీవ్ర అవిధేయతకు పాల్పడుచున్నారు. ఇటువంటి పరిస్థితులలో వారిని దండించే అనుమతి మాకు లభించవలెను. మహిళల విషయంలో ఇంత వరకు సవివరముగా ఆదేశాలు అవతరించనందున హద్దులు దాటిన స్త్రీని మీరు మీ ఆచారము ప్రకారము దండించవచ్చునని రసూలేకరీం సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. ఈ అనుమతి వలన అత్యవసర పరిస్థితులలో పురుషులు స్త్రీలను దండించే బదులు అరబ్బుల పురాతన ఆచారమును కొనసాగించిరి. స్త్రీలు రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సతీమణుల వద్దకు వచ్చి ఫిర్యాదులు చేయగా హుజూర్ (స) తమ అనుచరులతో ఇట్లనిరి. తమ జీవిత భాగస్వాముల పట్ల సత్ప్రవర్తనతో వ్యవహరించక, వారిని దండించే వారు అల్లాహ్ దృష్టిలో పుణ్యులుగా భావించబడరని నేను తెల్పుచున్నాను. ఆ తరువాత మహిళల హక్కులు పేర్కొనబడెను. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కరుణతో మొదటిసారి స్త్రీ స్వేచ్ఛగా శ్వాస తీసుకొనెను.

(అబూదావూద్ కితాబున్నికాహ్)

హింద కుమారుడు ముఆవియా (రజి) ఇట్లు తెల్పిరి. నేను రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లడిగితిని. ఓ రసూలుల్లాహ్! మాపై భార్యకు ఏ హక్కు గలదు. వారిట్లనిరి. అల్లాహ్ మీకు నొసంగిన దానిని వారికి తినిపించుము. అల్లాహ్ మీకు అందించిన దుస్తువులను వారికి ఇవ్వుము. వారిని కొట్టకుము, దూషించకుము. వారిని ఇంటి నుండి వెడల గొట్టకుము. (బుఖారి, ముస్లిం)

వారికి మహిళల మనోభావాల పట్ల ఎంత శ్రద్ధ ఉండేదనగా, వారు ఈ విషయమును గూర్చి ఎల్లప్పుడు ఇట్లు ఉపదేశించేవారు. ప్రయాణములో బయటికి పోయిన వ్యక్తులు వారిభార్యపిల్లలకు ఇబ్బంది కలగకూడదని తొందరగా తిరిగి ఇంటికి రావలెనని హితోపదేశం చేసేవారు.

హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖనం ప్రకారము ప్రయాణములో ఉన్న వ్యక్తి తన పర్యటన ఉద్దేశము పూర్తి కాగానే తన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకొని వెంటనే ఇంటికి తిరిగి రావలెనని వారు తెలిపిరి.

(బుఖారి, ముస్లిం)

హుజూర్ (స) విధానం కూడ ఇలాగే ఉండేది. వారు ప్రయాణం నుండి తిరిగి వచ్చేటప్పుడు పగలే నగరములో ప్రవేశించేవారు. రాత్రి అయినచో నగర శివారులలోనే బస చేసి, ఉదయం వేళ నగరములోకి ప్రవేశించేవారు. ఈ విధముగా రాత్రి అకస్మాత్తుగా ఇంటికి వచ్చి గృహిణులను ఇబ్బంది పెట్టకూడదని అనుచరులను వారు ఆదేశించేవారు.

(బుఖారి, ముస్లిం)

ఇందులో వారి దృష్టిలో ఒక గొప్ప వివేకముండెను. అనగా స్త్రీ పురుషుల సంబంధాలు చాలా సున్నితమైనవి. భర్త లేనందున భార్య తన దుస్తువుల విషయములో, శరీర పరిశుభ్రత విషయంలో పూర్తి దృష్టి సారించక పోవచ్చును. అలాంటి సమయంలో భర్త హఠాత్తుగా ఇంట్లోకి వచ్చినచో వారి ప్రేమానురాగాలలో తేడాలు వచ్చు అవకాశముండును.

### 124వ వార్షిక బహిరంగ సభ, ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ 124వ జల్సా సాలాన ఖాదియాన్ కొరకు **28, 29, 30, డిసెంబర్ 2018 ( శుక్ర, శని, ఆది** వారాలు) తేదీలను నిర్ధారించిరి, కావునా జమాఅత్ సోదరులు నేటి నుండే ప్రార్థనలు చేయుచు ఈ శుభకరమైన జల్సాలలో పాల్గొనుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తాలా మనందరికి ఈ ధార్మిక సమావేశము నుండి లాభము ఘడించుటకు భాగ్యము కల్గించు గాకా! ఈ జల్సా అన్ని విధాల సాఫల్యము పొందుటకు, సజ్జనులు మార్గదర్శనము పొందుటకు ప్రార్థనలు చేయగలరు. జజాకుముల్లాహ్.

( నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్, ఖాదియాన్)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of the Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz